

# జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా




సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 270 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 31, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# సామాన్యులపై దాడులు.. చేయడం సబబేనా..!

ప్రజాస్వామ్యం రక్షణకు విరుద్ధమైన పనులు చేస్తున్నారు

సామాన్యులను వేధించడమే శాసనంగా పెట్టుకుంటున్నారు

నిజాయితీగా వార్తలు రాస్తే బెంబెత్తిపోయి బెదిరింపులకు పాల్పడుతున్నారు

అధికారుల అవినీతి, అక్రమాలను ప్రశ్నించకపోతే బ్రతికేందుకు

అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడుల్లో బహిర్గతమవుతున్న వేలాది కోట్ల అధికారుల అక్రమ ఆస్తులు

సామాన్య ప్రజలను రోడ్లపై దారుణంగా చితకబాదుతున్న పోలీసులు

ప్రజలు ఏ విధంగా బ్రతకాలో తెలియక పిచ్చోళ్ళు అవుతున్నారు

ప్రభుత్వాల వేధింపులు అధికారుల దాడులు ఇవేనా ప్రజాస్వామ్య విలువలు

సామాన్య ప్రజలను వేధిస్తే సహించేది లేదు

నాయకుడనేవాడు ఎన్ని విమర్శలు ఎదుర్కొంటే అంతగా ఎదుగగలడు

అవినీతి కుంభకోణాల్లో ఇరుక్కుంటున్నా అధికారులు దినదినం పెరిగిపోతున్నారు

ప్రభుత్వ ఆస్తులను రక్షించడం ఎవరి బాధ్యత : డాక్టర్ బరిగెల శివ

సామాన్యులపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని డాక్టర్ బరిగెల శివ మండిపడ్డారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థలే ప్రజలను వేధిస్తే ప్రజాస్వామ్యానికి అర్థమేంటని ప్రశ్నించారు. నిజాయితీగా వార్తలు రాసే పాత్రికేయులు, ప్రజా సమస్యలను ప్రశ్నించే వారిని బెదిరించడం దారుణమన్నారు. అవినీతి, అక్రమాలను ప్రశ్నించేవారిపై అధికార దుర్వినియోగం చేయడం తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. అవినీతి నిరోధక శాఖ దాడుల్లో భారీగా అక్రమ ఆస్తులు వెలుగులోకి వస్తున్నా అసలైన అవినీతిపరులపై చర్యలు ఎందుకు నెమ్మదిస్తున్నాయని ప్రశ్నించారు. సామాన్యులపై లాఠీలు ఝుళిపించే పోలీసులు భూకబ్జాదారులు, అవినీతిపరులు, అరాచక శక్తులపై అదే స్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు రాజ్యాంగం, చట్టం ప్రకారం నిష్పక్షపాతంగా పనిచేయాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులు, ప్రజాసంఘాలు, పాత్రికేయుల హక్కులను అణచివేయడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమేనన్నారు. ప్రభుత్వ ఆస్తులు ప్రజల ఆస్తులేనని, వాటిని దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ప్రభుత్వాల బాధ్యత అని స్పష్టం చేశారు. సామాన్యులపై దాడులు, వేధింపులు ఇకనైనా ఆపి ప్రజలకు రక్షణగా నిలవాలని డాక్టర్ బరిగెల శివ ప్రభుత్వాలను, అధికారులను కోరారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## డీలిమిటేషన్‌తో ఎవరికి లాభం.. ఎవరికి నష్టం?

మారనున్న తెలంగాణ రాజకీయ పటం!


పెరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు

కాంగ్రెస్, బీజేపీలకు కొత్త అవకాశాలా?

బీఆర్ఎస్, ఎంఐఎంకు కొత్త సవాళ్లా?

మారనున్న ఓటు బ్యాంకులు, రాజకీయ సమీకరణాలు

3




## ఏఐ టెక్నాలజీతో జెండావందనం..

కరీంనగర్ బాల మేధావికి ఈటల అభినందనలు

కరీంనగర్ జిల్లా బాలుడి అద్భుత ఆవిష్కరణ

ఏఐ, మొబైల్ ఆధారిత ఫ్లాగ్ హోస్టింగ్ సిస్టమ్ రూపకల్పన

13 ఏళ్ల శ్రీ సృష్టి సాయిని ప్రశంసించిన ఎంపీ ఈటల రాజేందర్

ప్రధాని మోదీ వల్లే దేశంలో డిజిటల్ విప్లవం సాధ్యమైందన్న ఈటల

విద్యార్థులు ఏఐ, కోడింగ్ నైపుణ్యాలు నేర్చుకోవాలని పిలుపు

**కరీంనగర్, జై భీమ్ న్యూస్**

కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన 13 ఏళ్ల బాల మేధావి శ్రీ సృష్టి సాయి సాంకేతిక ప్రతిభపై మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ప్రశంసల వర్షం కురిపించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో మొబైల్ ద్వారా నియంత్రించే వైఫై ఆధారిత ఫ్లాగ్ హోస్టింగ్ (జెండా వందనం) సిస్టమ్‌ను రూపొందించిన సృష్టి సాయిని ఆయన అభినందించారు. చిన్న వయసులోనే సాంకేతికతపై పట్టు సాధించి అద్భుత ఆవిష్కరణ చేసిన ఆ బాలుడు ఎందరికో ఆదర్శమని కొనియాడారు. ఈ విషయంపై ఈటల రాజేందర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "శ్రీ సృష్టి సాయి ప్రదర్శించిన సాంకేతిక ప్రతిభ అభినందనీయం. ఈ పిన్న వయసులోనే అతని ఆవిష్కరణ గర్వకారణం" అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 'డిజిటల్ ఇండియా' దార్శనికతతో దేశం ముందుకు దూసుకెళ్తోందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం వల్లే సృష్టి సాయి వంటి యువ ప్రతిభావంతులు వెలుగులోకి వస్తున్నారని అభిప్రాయపడ్డారు. మోదీ ప్రోత్సాహంతో భారత్ నేడు కేవలం టెక్నాలజీని వినియోగించే దేశంగా కాకుండా, కొత్త టెక్నాలజీలను సృష్టించే గ్లోబల్ హబ్‌గా మారుతోందని ఈటల అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి విద్యార్థులు సంప్రదాయ చదువులతో పాటు ఏఐ, కోడింగ్ వంటి ఆధునిక నైపుణ్యాలను అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. శ్రీ సృష్టి సాయి భవిష్యత్తులో మరిన్ని గొప్ప ఆవిష్కరణలు చేయాలని మనసారా ఆకాంక్షిస్తున్నట్లు తన పోస్టులో ఈటల రాజేందర్ పేర్కొన్నారు.





## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి.. అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమేనన్న టీపీసీసీ చీఫ్

రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి

సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా

అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీపై వచ్చే నెలలో స్పష్టత

కాంగ్రెస్ ఒక మహాసముద్రమని, అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉంటుందని వ్యాఖ్య

5

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

## తలసేమియా చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం విజయవంతం

**51 యూనిట్ల రక్తం సేకరణ.. రక్తదాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు**



**వరంగల్, 30 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు అండగా నిలిచేందుకు వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సహకారంతో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతినగర్ రైల్వే గేట్ సమీపంలోని వాసవి భవన్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు శిరుప అనిల్, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్, జిల్లా యువజన సంఘం అధ్యక్షులు యాద రవికుమార్ ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శిరుప అనిల్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు తరచూ రక్తం అవసరమవుతుందని తెలిపారు. సాధారణంగా ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని, సకాలంలో రక్తం అందకపోతే వారి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇలాంటి చిన్నారుల కోసం స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో 51 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. యువతతో పాటు పలువురు స్వచ్ఛంద రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు గార్లపాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేందర్, కోశాధికారి గందె శ్రీనివాస్, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), పోలీస్ కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వైనాల రమేష్, వేణు, శంకర్ గోపాల్, రమేష్, విజయ్ కుమార్, వినయ్, సంతోష్, అశోక్, సదాశివుడు, మూర్తి, నాగేశ్వరరావు, విక్రమ్, రంజిత్, రవి, శ్రీనివాస్, సతీష్, అనిల్, సునీల్, నిఖిల్, శ్రావణ్, రాజేష్, గజ్జెల సుమన్, ఉప్పరపల్లి రాజ్ కుమార్, ఊరటి రవికుమార్, అలువల పృథ్వి, మునిగాల రాంప్రసాద్, ఎస్.కె. ముస్తఫా తదితరులు రక్తదానం చేశారు. తలసేమియా చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు.

## గురుకులంలో 5వ తరగతి విద్యార్థినిని కాటు వేసిన పాము

**వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో ఘటన**

**వర్ధన్నపేట సామాజిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స**

**మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలింపు**

**రాయపర్తి, 30 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో పాము కలకలం రేపింది. గురుకులంలో 5వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిని పాము కాటు వేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పాము కాటుకు గురైన విద్యార్థినిని వెంటనే వర్ధన్నపేట సామాజిక ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. గురుకులంలో పాము కాటు ఘటనతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. గురుకుల ప్రాంగణంలో పాముల సంచారం లేకుండా అధికారులు తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# సామాన్యులపై "దాడులు" చేయడం సబబేనా

**ప్రజాస్వామ్యం రక్షణకు విరుద్ధమైన పనులు చేస్తున్నారు**

**సామాన్యులను వేధించడమే శాసనంగా పెట్టుకుంటున్నారు**

**నిజాయితీగా వార్తలు రాస్తే బెంబెత్తిపోయి బెదిరింపులకు పాల్పడుతున్నారు**

**అధికారుల అవినీతి, అక్రమాలను ప్రశ్నించకపోతే బ్రతికేందుకు**

**అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడుల్లో బహిర్గతమవుతున్న వేలాది కోట్ల అధికారుల అక్రమ ఆస్తులు**

**సామాన్య ప్రజలను రోడ్లపై దారుణంగా చితకబాదుతున్న పోలీసులు**

**ప్రజలు ఏ విధంగా బ్రతకాలో తెలియక పిచ్చోళ్ళు అవుతున్నారు**

**ప్రభుత్వాల వేధింపులు అధికారుల దాడులు ఇవేనా ప్రజాస్వామ్య విలువలు**

**సామాన్య ప్రజలను వేధిస్తే సహించేది లేదు**

**నాయకుడనేవాడు ఎన్ని విమర్శలు ఎదుర్కొంటే అంతగా ఎదుగగలడు**

**అవినీతి కుంభకోణాల్లో ఇరుక్కుంటున్నా అధికారులు దినదినం పెరిగిపోతున్నారు**

**ప్రభుత్వ ఆస్తులను రక్షించడం ఎవరి బాధ్యత**

**డాక్టర్ బరిగెల శివ**



**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

సామాన్య ప్రజల హక్కులను కాపాడుకోలేకపోతే సమాజం అంతరించిపోతుందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.దేశంలో ఎక్కడ చూసిన సామాన్యులపై విచ్చలవిడిగా దాడులు పెరిగిపోవడాన్ని తీవ్రంగా ఖండించారు.రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన ప్రభుత్వ అధికారులు అధికార విలువలను దిగజార్చుకొని ప్రజలపై దాడులకు ఎగబడుతున్నారని హెచ్చరించారు.ప్రజల మనోభావాలతో సంబంధం లేకుండా రాజకీయ నాయకుల కబంధహస్తాల్లో ఇరుక్కుపోయి ప్రజాస్వామ్యాన్ని ప్రత్యక్షంగా నాశనంపాలు చేయడానికి పూనుకుంటున్నారని తీవ్రంగా ఖండించారు.ఢిల్లీలో జంతర్ మంతర్ ధర్నాలో పాల్గొన్న విద్యార్థులను తీవ్రవాదుల కన్నా హీనంగా చిత్రీకరిస్తున్నారని వాళ్ల ఆచూకీని అడ్రస్ లను వెతికి పట్టుకొని వెంటాడుతున్నారని హెచ్చరించారు.అదే సందర్భంలో పుల్వామా, పహాల్గాం,దాడుల వెనుక దాగి ఉన్న తీవ్రవాదులను, టెర్రరిస్టులను గుర్తించడంలో కేంద్ర హోంశాఖ పూర్తిగా విఫలమైందని దాడుల వెనుక అసలైన కారణం తెలియజేయడానికి కేంద్ర ప్రభుత్వం విముఖత చూపడం వెనకాల దేశ ప్రజలు తీవ్రమైన అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు.దేశాన్ని అధోగతి పాలు చేస్తూ దేశ ప్రజల ఉసురు పోసుకుంటూ దేశాన్ని బ్రహ్మాండంగా పాలిస్తున్నామని అభివృద్ధి పథంలోనికి నడిపిస్తున్నామని వీర్రవీగుతున్న నాయకులందరూ దేశద్రోహులే నంటూ హెచ్చరించారు.సామాన్య ప్రజలపై దాడులు చేయడం వెనకాల ప్రజారక్షణను అణిచివేయడమే ప్రధాన కారణం అంటూ సూటిగా నిలదీశారు.

**తెలుగు రాష్ట్రాల పరిస్థితి దారుణం..**

తెలుగు రాష్ట్రాల్లో సామాన్యులపై విచ్చలవిడిగా దాడులు పెరిగిపోతున్నాయని వాటిని నియంత్రించడంలో పోలీసు యంత్రాంగం వెనుకబాటుతనాన్ని ప్రదర్శిస్తుందని ప్రజలు భావిస్తున్నారన్నారు.కొన్ని సందర్భాల్లో పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుస్తున్నప్పటికిని అది కాస్త సామాన్లపై మాత్రమే ప్రయోగిస్తూ అసలైన అరాచక శక్తులను తాకడానికి సాహసం చేయకపోవడం రాజకీయ పలుకుబడికి తలొగ్గుతున్నారని తెలుగు ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో పోలీసు ఉన్నతాధికారులు దేశస్థాయి పరిపాలనను అవలంబిస్తుంటే మరికొన్ని ప్రాంతాల్లో రాజకీయ నాయకుల కబంధహస్తాల్లో పోలీసింగ్ విధానాలు నడుస్తున్నందున అలాంటి ప్రాంతాల పోలీస్ వ్యవహారాలను రాజకీయ వ్యవహారాలుగా పరిగణిస్తూ ప్రజలు తీవ్రమైన విమర్శలు గుప్పిస్తున్నారన్నారు.మహిళలని చూడకుండా వృద్ధులని చూడకుండా విద్యార్థులని చూడకుండా చిత్రవధకు గురి చేసే దాడులు చేయడమే కాకుండా నడిరోడ్లపై కుక్కలను ఈడ్చికెళ్లినట్టు ఈడ్చికేల్లడం పోలీస్ గిరిల భావించడాన్ని తీవ్రంగా ఖండించారు.ప్రజల హక్కులకు భంగం కలిగిస్తున్నది అసాంఘిక శక్తులు, అసాంఘిక రాజకీయ నాయకులు, అరాచక శక్తులైనప్పుడు సామాన్య ప్రజలపై రెచ్చిపోతున్న పోలీస్ లాటీలు అరాచక శక్తులపై ఎందుకు తోకముడుస్తున్నాయని నిలదీశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలన ఎప్పుడో చెదిరిపోయిందని కనీసం తెలంగాణలోనైనా రాష్ట్ర పోలీస్ శాఖలో వినూత్నమైన ప్రజాసేవ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్న రాష్ట్ర పోలీస్ బాస్ పీవి ఆనంద్ ఐపీఎస్ రాష్ట్ర పోలీసింగ్ విధివిధానాలను పటిష్ట పోలీసింగ్,స్ట్రాంగ్ పోలీసింగ్, సేవా పోలీసింగ్,ప్రజా రక్షణ పోలీసింగ్,సాధారణ పోలీసింగ్,సాహసవంతమైన పోలీసింగ్, లాంటి ప్రతిష్టాత్మకమైన అభివృద్ధి వైపు నడిపించడం కోసం ప్రయత్నించడాన్ని రాష్ట్ర ప్రజలకు అందిస్తూ ఉంటే రాజకీయ జోక్యంతో అలాంటి సేవలకు తీవ్రమైన ఆటంకాలు కల్పించబడుతున్నాయని రాష్ట్ర ప్రజలు విమర్శిస్తున్నారు.పోలీస్ సేవల పట్ల ఎన్నడూ లేని విధంగా ప్రజలు వ్యతిరేకత పెంచుకోవడానికి ప్రధాన కారణం సామాన్యులపై జరుగుతున్న దాడులే నంటూ వివరించారు.విద్యార్థి ఉద్యమాలను అణిచివేయడంలో పలుచోట్ల పోలీసుల నిర్వహిస్తున్న దౌర్జన్యాలు అంతా ఇంతా కాదన్నారు.స్థానికంగా జీవిస్తున్న వ్యక్తులపై చిత్రవధ లాంటి కుట్రలను ప్రయోగిస్తున్నారని ముందస్తు రక్షణలో భాగమంటూ గుంపులు గుంపులుగా చేరిపోతూ పోలీసులు ప్రజలను మనశ్శాంతి లేకుండా చేస్తున్నారని గుర్తు చేశారు.భూకబ్జాదారులను అక్రమంగా వ్యాపారాలు చేస్తున్న వ్యక్తులను,ప్రభుత్వ కార్యాలయాలను అధోగతి పాలు చేస్తూ అరాచకాలు సృష్టిస్తున్న అధికారులను,అక్రమాస్తులు సంపాదించుకుంటూ అవినీతి ఆస్తులు సంపాదించుకుంటూ మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న ప్రభుత్వ ఉన్నతాధికారులను నిర్మోహమాటం లేకుండా కట్టడి చేయాల్సిన పోలీసులు అవినీతి అధికారులు, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు,సిఫారసు చేస్తున్న విషయాల పట్ల నిజాయితీపరులను, సామాన్యులను , ఉద్యమకారులను, నిరుద్యోగులను ,ప్రతిపక్షాలను ప్రజాసంఘాలను ,కార్మిక సంఘాలను తీవ్రంగా అణిచివేసే ప్రయత్నాలు చేస్తున్నారని రాష్ట్రంలో జరుగుతున్న పలు విధాల సంఘటనలు ప్రస్ఫుటంగా తెలియజేస్తున్నాయన్నారు. సాధారణ ప్రజలు వాళ్ళ బాధలు చెప్పుకోవడానికి రాజకీయ నాయకులు ఏమాత్రం అవకాశాలు కల్పించడం లేదంటూ సైరన్ వాహనాలతో చెక్కర్లు కొడుతూ ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామ్య విలువలను, రక్షించకుండా ప్రజలకు సేవ చేయడం వదిలేసిన తెలుగు రాష్ట్రాల్లోని ప్రజాప్రతినిధులు,రాజకీయ ప్రభుత్వ నాయకులు ప్రభుత్వ అధికారులు సాధారణ ప్రజలపై కక్ష కట్టినట్టుగా అధికార జీవణ విధానాలను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు.

**ఆస్తుల సంపాదన కోసం ఎందుకింత ఆత్రుతా!**

ఒకప్పుడు సామాన్యులు మరొకప్పుడు మధ్యస్తులు నేడు అవినీతి సామ్రాజ్యాలకు ఆద్యుల్లా వెలిగిపోతున్న అవినీతి సామ్రాజ్యపరులను అంతమొందించకపోతే తెలుగు రాష్ట్రాల్లో అవినీతి కుంభ కొణాలకు ఉరకలేస్తున్న అవినీతిపరులదే ప్రత్యేక సామ్రాజ్యం అవుతుందని గుర్తు చేశారు.దేశాన్ని దోచుకోవడంలో అత్యంత వాడివేడిగా సాగుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దల పరిపాలన అన్ని రాష్ట్రాలకు పాకిందని ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలను పాకడంలో వెనుకడుగు వేయలేకపోవడం బాధాకరమన్నారు.ప్రజా ప్రతినిధులైన మంత్రులైన వ్యాపారస్తులైన అధికారులైన అందరూ మానవత్వాన్ని మర్చిపోయి అక్రమ ఆస్తుల సంపాదన కొరకు ఉరకలాడుతున్నారే తప్ప నిజాయితీగా జీవిద్దామన్న సోయలేకుండా పోతుందన్నారు.అవినీతి సంపాదనకు ఆరటపడుతున్న ప్రతి ఒక్కరూ సామాన్యులను అణిచివేసే బాధ్యతను తీసుకుంటూ రాజకీయ మెప్పు పొందుకుంటూ అధికార బాధ్యతలను అక్రమస్తుల వ్యాపారాలకు రాజకీయ నాయకుల మెప్పు కొరకు వాడుకుంటున్నారన్నది మాత్రం పచ్చి నిజమన్నారు.ఇటు రాజకీయాల్లో గాని అటు ప్రభుత్వ కార్యాలయాల్లో గాని అక్రమాలకు పాల్పడుతూ అవినీతికి పాల్పడుతూ దుబారా జీవితాలు గడుపుతున్నోల్లంతా రానున్న కాలంలో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.ఆస్తుల సంపాదనకు మరిగినోళ్లంతా పేదలను హీనంగా చూస్తున్నారని పేదలంటే పట్టింపు లేకుండా బ్రతుకుతున్నారని హెచ్చరించారు.ప్రభుత్వమున్నది పేదల కొరకే,ప్రభుత్వ వ్యవస్థలు ఉన్నది పేదల కొరకే నన్న సంగతిని మర్చిపోయి సామాన్యులపై దాడులు చేస్తూ సాహసవంతులమని విర్రవీగుతున్నారని అదే నిజమని భావిస్తున్న అధికార రాజకీయ శక్తులందరూ అరాచక శక్తులను అణిచివేయడంలో కాస్తంత ధైర్య సాహసాలను ప్రదర్శించిన సామాన్య ప్రజలకు రక్షణ లభిస్తుందని గుర్తు చేశారు.సామాన్యులపై దాడులు చేస్తేనే జీవితము అనుకుంటే పుట్టగతులులేకుండా పోతారు అంటూ హెచ్చరించారు.ఇకనైనా రాజకీయ ప్రజాప్రతినిధులను మెప్పించడం కోసం సామాన్యులపై దాడులు చేయడం సామాన్యులను అణిచి వేయడం మానుకోవాలని హితవుపలికారు.దేశంలో లక్షల కోట్ల రూపాయలు దుబారాల పేరు మీద మాయమైపోతుంటే మాట మాత్రం మాట్లాడని తెలుగు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు ఆస్తుల సంపాదనలో ఆరితేరి పోతున్నారని అలాంటి వాళ్ళ బాటలోనే ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి అధికారులు చక్కగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్నారని మండిపడ్డారు.సందర్భానుసారంగా కొన్ని ప్రాంతాల్లో సందర్భాలు లేకుండా మరికొన్ని ప్రాంతాల్లో రాజకీయ శక్తుల ప్రభావాన్ని అభివృద్ధి పరచుకోవడం కోసం సామాన్యులను విపరీతంగా కొట్టిస్తున్నారని అలాంటివి పూర్తిగా మానుకొని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం కోసం సామాన్య ప్రజలకు రక్షణగా నిలవాలని పిలుపునిచ్చారు.

# ప్రజారోగ్య సేవకు అశోక్‌రెడ్డి అంకిత జీవితం..

**మూడు దశాబ్దాలకు పైగా ప్రజలకు ఆరోగ్య స్వరం!**


**హెల్త్ అసిస్టెంట్‌గా మొదలై జిల్లా మాస్ మీడియా అధికారి వరకు సుదీర్ఘ ప్రస్థానం**

**ప్రజారోగ్య అవగాహనలో విశేష కృషి.. ఆరు సార్లు ఉత్తమ జిల్లా అధికారిగా గుర్తింపు**

**ఆగస్టు 2026లో పదవీ విరమణ.. అశోక్‌రెడ్డి సేవలకు ఘనమైన అభినందనలు**

**హన్మకొండ, 30 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజారోగ్యమే పరమావధిగా భావించి వైద్యారోగ్యశాఖలో దశాబ్దాలపాటు అంకితభావంతో సేవలందించిన వరంగల్ జిల్లా మాస్ మీడియా అధికారి వేముల అశోక్‌రెడ్డి సేవా ప్రస్థానం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. 1985లో ఆరోగ్య సహాయకుడిగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన, ప్రజలతో నేరుగా మమేకమై ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణ, ప్రభుత్వ వైద్య సేవలు, ప్రజారోగ్య కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్య విద్యావేత్తగా, ఉప జిల్లా మాస్ మీడియా అధికారిగా, ఆరోగ్య విద్యా విస్తరణ అధికారిగా వివిధ బాధ్యతలు నిర్వర్తించి, చివరకు వరంగల్ జిల్లా మాస్ మీడియా అధికారిగా ప్రజారోగ్యానికి తన వంతు సేవలందించారు. వేముల ప్రతాప్‌రెడ్డి–సూర్యమ్మ దంపతుల ఆశీస్సుల ఫలితంగా వరంగల్ జిల్లా గడ్డపై జన్మించిన వేముల అశోక్‌రెడ్డి, కళావతిని వివాహం చేసుకుని కుటుంబ జీవితాన్ని కూడా విజయవంతంగా కొనసాగించారు. తేజస్వి, పూజిత అనే ఇద్దరు కుమార్తెలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది, వారి వివాహాలను ఘనంగా నిర్వహించి, వారు అమెరికాలో స్థిరపడేలా తండ్రిగా తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే ప్రజాసేవను తన జీవిత ధ్యేయంగా కొనసాగించడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. 1985లో ఆరోగ్య సహాయకుడిగా వైద్యారోగ్యశాఖలో అడుగుపెట్టిన అశోక్‌రెడ్డి, ఉద్యోగాన్ని కేవలం ఉపాధిగా కాకుండా ప్రజలకు సేవ చేసే పవిత్రమైన అవకాశంగా భావించారు. ప్రజల ఆరోగ్య సమస్యలను దగ్గరగా తెలుసుకుంటూ, వారికి అవసరమైన ఆరోగ్య సమాచారాన్ని అందించడంతో పాటు వ్యాధుల నివారణ, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు నిరంతరం కృషి చేశారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు విద్యాభ్యాసానికి కూడా ప్రాధాన్యతనిచ్చిన ఆయన సామాజిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీతో పాటు ముంబైలో పీజీడీహెచ్‌ఈ విద్యను అభ్యసించారు. తాను సంపాదించిన విద్య, అనుభవం, సామాజిక అవగాహనను ప్రజారోగ్య సేవలకు అనుసంధానం చేస్తూ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లారు. ఆరోగ్య విద్యావేత్తగా పనిచేసిన సమయంలో ప్రజలతో నేరుగా మాట్లాడి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన ఆయన, అనంతరం ఉప జిల్లా మాస్ మీడియా అధికారిగా శాఖా కార్యక్రమాలకు తన అనుభవాన్ని అందించారు. ఆరోగ్య విద్యా విస్తరణ అధికారిగా ప్రజారోగ్య విధానాలు, కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో కీలకపాత్ర పోషించారు. జిల్లా మాస్ మీడియా అధికారిగా ప్రభుత్వ వైద్యారోగ్య కార్యక్రమాలు, వ్యాధుల నియంత్రణ చర్యలు, ఆరోగ్య పరిరక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తూ వైద్యారోగ్యశాఖకు ప్రజల్లో ఒక బలమైన స్వరంగా నిలిచారు. ప్రజారోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో చేరవేయడంలో ఆయనకు ఉన్న అనుభవం ఎంతగానో ఉపయోగపడింది. అధికారులు, వైద్య సిబ్బంది, మీడియా ప్రతినిధులు, ప్రజల మధ్య సమన్వయంతో పనిచేస్తూ శాఖా కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లారు. తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించడంతో పాటు సహచర ఉద్యోగులకు, యువ సిబ్బందికి తన అనుభవాన్ని పంచుతూ మార్గదర్శకుడిగా నిలిచారు. వైద్యారోగ్యశాఖలో ఆయన అందించిన విశిష్ట సేవలకు అనేక గుర్తింపులు లభించాయి. ముఖ్యంగా ఆరు సార్లు ఉత్తమ జిల్లా అధికారిగా గౌరవం పొందడం ఆయన సేవా తత్పరతకు, ప్రతిభకు, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. ఈ గౌరవాలు ఆయన వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే కాకుండా ప్రజారోగ్య రంగంలో ఆయన చేసిన నిరంతర కృషికి లభించిన గుర్తింపుగా సహచరులు అభివర్ణించారు. పదవి, హోదా కంటే ప్రజాసేవకే అధిక ప్రాధాన్యతనిస్తూ పనిచేసిన అశోక్‌రెడ్డి జీవన ప్రస్థానం ప్రభుత్వ ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతతో పాటు సహచరుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించడం ఆయన ప్రత్యేకతగా నిలిచిందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సంపాదించిన అనుభవాన్ని సహచరులతో పంచుకుంటూ, అనేక మందికి దిశానిర్దేశం చేసిన ఆయన శాఖలో మంచి పేరు సంపాదించుకున్నారు. దశాబ్దాలపాటు ప్రజారోగ్య రంగానికి సేవలందించిన వేముల అశోక్‌రెడ్డి ఆగస్టు 2026లో పదవీ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి పనిచేసిన అధికారులు, ఉద్యోగులు ఆయన సేవలను స్మరించుకుంటూ అభినందనలు తెలిపారు. ఉద్యోగ జీవితానికి విరామం పలుకుతున్నప్పటికీ, ప్రజారోగ్య రంగానికి ఆయన



అందించిన సేవలు, ఆరోగ్య అవగాహన కోసం చేసిన కృషి, సహచరులకు అందించిన మార్గదర్శకత్వం చిరకాలం గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. తెలంగాణ వైద్య ఆరోగ్య గెజిటెడ్ అధికారుల సంఘం తరఫున వేముల అశోక్‌రెడ్డికి హృదయపూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. వైద్యారోగ్యశాఖకు, ప్రజలకు ఆయన అందించిన నిస్వార్థ సేవలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని హృదయపూర్వకంగా కోరుకున్నారు. 1985లో ఆరోగ్య సహాయకుడిగా ప్రారంభమైన సేవా ప్రస్థానం.. 2026లో జిల్లా మాస్ మీడియా అధికారిగా పదవీ విరమణ వరకు కొనసాగింది. ప్రజారోగ్యానికి అంకితమైన వేముల అశోక్‌రెడ్డి సేవలు, ఆరు సార్లు పొందిన ఉత్తమ జిల్లా అధికారి గుర్తింపులు ఆయన సుదీర్ఘ సేవా జీవితానికి చెరగని ముద్రగా నిలిచిపోనున్నాయి.

# డీలిమిటేషన్ తెలంగాణలో ఎవరికి లాభం... ఎవరికి నష్టం?

**డాక్టర్ బరిగెల శివ**

**తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చబోతున్న నియోజకవర్గాల పునర్విభజన!**
**పెరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు...**
**మారనున్న పార్టీల రాజకీయ లెక్కలు!**

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

తెలంగాణలో మరోసారి డీలిమిటేషన్ అంశం రాజకీయ చర్చకు కేంద్రబిందువుగా మారుతోంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే తెలంగాణ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 119 అసెంబ్లీ స్థానాలు పెరిగి సుమారు 179 నుంచి 182 వరకు చేరవచ్చని, అలాగే 17 లోక్‌సభ స్థానాలు 26 వరకు పెరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**అయితే అసలు ప్రశ్న ఒక్కటే...**

డీలిమిటేషన్ వల్ల తెలంగాణలో ఎవరికి లాభం? ఎవరికి రాజకీయంగా నష్టం? దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన అంశం, మహిళా రిజర్వేషన్ల అమలు, భవిష్యత్ జనాభా లెక్కలు, పార్లమెంట్ స్థానాల పెంపు వంటి అంశాలతో ముడిపడి ఉంది. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే కొత్త రాజకీయ సరిహద్దులు ఏర్పడే అవకాశం ఉంది. కొందరి అంచనాల ప్రకారం 2028 లేదా 2034 నాటికి ఈ ప్రక్రియ కీలక దశకు చేరవచ్చని, ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో కొత్త నియోజకవర్గాల ప్రభావం కనిపించవచ్చని భావిస్తున్నారు.

**పట్టణ తెలంగాణ పెరిగితే జాతీయ పార్టీలకు బలం?**

హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి పరిసర ప్రాంతాలు వేగంగా విస్తరిస్తున్నాయి. కొత్త కాలనీలు, ఐటీ కారిడార్లు, పారిశ్రామిక ప్రాంతాలు, నగర విస్తరణ కారణంగా జనాభా పెరుగుతోంది. డీలిమిటేషన్‌లో జనాభా, భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా సౌలభ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తే పట్టణ ప్రాంతాల్లో కొత్త నియోజకవర్గాలు పెరిగే అవకాశం ఉంది. ఇదే జరిగితే విస్తృత స్థాయిలో రాజకీయ నిర్మాణం ఉన్న కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలకు కొత్త అవకాశాలు రావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతి కొత్త నియోజకవర్గంలో కొత్త నాయకత్వాన్ని తయారు




చేసుకునే అవకాశం జాతీయ పార్టీలకు ఎక్కువగా ఉంటుంది.

**బీఆర్ఎస్‌కు కొత్త సవాళ్లు?**

తెలంగాణ ఉద్యమం, ప్రాంతీయ భావోద్వేగం, గ్రామీణ స్థాయి రాజకీయ నిర్మాణంతో ఎదిగిన బీఆర్ఎస్‌కు డీలిమిటేషన్ కొత్త రాజకీయ పరీక్షగా మారవచ్చు. ఇప్పటివరకు బలంగా ఉన్న కొన్ని నియోజకవర్గాలు విభజనకు గురైతే స్థానిక నాయకత్వ సమీకరణాలు మారే అవకాశం ఉంది. కొత్త నియోజకవర్గాలు ఏర్పడటం అంటే కేవలం స్థానాలు పెరగడం మాత్రమే కాదు. కొత్త నాయకులు, కొత్త సామాజిక సమీకరణాలు, కొత్త ఓటరు వర్గాలు కూడా రాజకీయ రంగంలోకి వస్తాయి. దీంతో ప్రాంతీయ పార్టీలు తమ పాత బలాన్ని కొత్త రాజకీయ భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవాల్సిన పరిస్థితి రావచ్చు.

**ఎంఐఎంకు ప్రభావం ఎంత?**

పాత నగరంతో పాటు హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో బలమైన రాజకీయ పట్టు కలిగిన ఎంఐఎంకు కూడా డీలిమిటేషన్ కీలక అంశమే. నియోజకవర్గాల సరిహద్దులు మారితే ఓటర్ల సామాజిక, భౌగోళిక సమీకరణాల్లో మార్పులు రావచ్చు. అయితే ఇది పూర్తిగా నష్టం లేదా పూర్తిగా లాభం అని ఇప్పుడే చెప్పడం సాధ్యం కాదు. కొత్త సరిహద్దులు ఎలా నిర్ణయిస్తారు? జనాభా ప్రాతిపదిక ఏమిటి? ఏ ప్రాంతాలను ఏ నియోజకవర్గంలో కలుపుతారు? అనే అంశాలపై అసలు రాజకీయ ప్రభావం ఆధారపడి ఉంటుంది.

**కాంగ్రెస్, బీజేపీల మధ్య కొత్త పోటీ**

కొత్తగా 50కి పైగా అసెంబ్లీ స్థానాలు పెరిగే పరిస్థితి వస్తే తెలంగాణ రాజకీయాల్లో పోటీ మరింత తీవ్రంగా మారే అవకాశం ఉంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు కొత్త ప్రాంతాల్లో తన సంస్థాగత బలాన్ని పెంచుకునే అవకాశం ఉండగా, బీజేపీకి పట్టణ ప్రాంతాలు, యువత, కొత్త ఓటర్లలో తన ప్రభావాన్ని విస్తరించే అవకాశం ఉంటుంది.

**కొత్త నియోజకవర్గాలు అంటే కొత్త టికెట్లు... కొత్త ఆశావహులు... కొత్త రాజకీయ సమీకరణాలు.**

ఇప్పటికే రాజకీయ పార్టీల్లో టికెట్ ఆశావహుల సంఖ్య భారీగా ఉంది. స్థానాలు పెరిగితే నాయకులకు అవకాశాలు పెరిగినా, అదే సమయంలో పార్టీల మధ్య అంతర్గత పోటీ కూడా పెరగవచ్చు.

**దక్షిణాది రాష్ట్రాల ఆందోళన ఇదే!**

డీలిమిటేషన్ విషయంలో తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో ప్రధాన ఆందోళన జనాభా అంశంపైనే ఉంది. కుటుంబ నియంత్రణ, అభివృద్ధి వంటి అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించిన రాష్ట్రాలకు, జనాభా ఆధారంగా పార్లమెంట్ ప్రాతినిధ్యం నిర్ణయిస్తే నష్టం జరుగుతుందనే వాదన వినిపిస్తోంది. అంటే ఒకవైపు రాష్ట్రాల జనాభా పెరుగుదల ఆధారంగా స్థానాలు పెరిగితే, మరోవైపు జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యంపై ప్రభావం పడవచ్చన్న ఆందోళన ఉంది.

**తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం?**

డీలిమిటేషన్ జరిగితే తెలంగాణలో కేవలం నియోజకవర్గాల సంఖ్య మాత్రమే మారదు... నాయకుల భవిష్యత్తు మారుతుంది... పార్టీల బలం మారుతుంది... ఓటు బ్యాంకుల లెక్కలు మారుతాయి... గ్రామీణ--పట్టణ రాజకీయ సమీకరణాలు మారుతాయి... మొత్తానికి డీలిమిటేషన్ తెలంగాణ రాజకీయాల్లో ఒక పెద్ద గేమ్ ఛేంజర్ అయ్యే అవకాశం ఉంది. అయితే ఎవరు లాభపడతారు, ఎవరు నష్టపోతారు అన్నది ఇప్పుడే ఖరారు చేయడం కష్టం. ఎందుకంటే చివరికి రాజకీయ పార్టీల భవిష్యత్తును నిర్ణయించేది ఎన్ని స్థానాలు పెరిగాయి అన్నది కాదు... ఆ కొత్త నియోజకవర్గాల సరిహద్దులు ఎలా మారాయి, అక్కడి ఓటర్ల సమీకరణం ఎలా ఉంది, రాజకీయ పార్టీలు ఎంత వేగంగా కొత్త పరిస్థితులకు అనుగుణంగా మారాయి అన్నదే అసలు కీలకం. డీలిమిటేషన్ తెలంగాణ రాజకీయ పటాన్ని మార్చబోతోందా? లేక పాత పార్టీలకు కొత్త జీవం పోస్తుందా? జాతీయ పార్టీలకు బలం పెరుగుతుందా? ప్రాంతీయ పార్టీలకు కొత్త సవాళ్లు ఎదురవుతాయా?

# బోడుప్పల్‌లో ‘పీక్ ప్రెసిషన్ షూటింగ్ అకాడమీ’ ప్రారంభం





**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

క్రీడాకారులకు నాణ్యమైన షూటింగ్ శిక్షణ అందించాలనే లక్ష్యంతో బోడుప్పల్‌లో ‘పీక్ ప్రెసిషన్ షూటింగ్ అకాడమీ’ని కోచ్ మీసాల శైలేంద్ర ఏర్పాటు చేశారు. అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డా. పి. భువనేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై అకాడమీని ప్రారంభించారు. జాతీయ స్థాయిలో షూటింగ్‌లో ప్రతిభ కనబరిచిన డా. పి. భువనేశ్వరి చేతుల మీదుగా అకాడమీ ప్రారంభం కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పీక్ ప్రెసిషన్ షూటింగ్ అకాడమీలో రైఫిల్ షూటింగ్‌తో పాటు షూటింగ్ క్రీడలో ఆసక్తి ఉన్న వారికి శిక్షణ అందించేందుకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎన్ఐఎస్ సర్టిఫైడ్ షూటింగ్ కోచ్, టెక్నికల్ ఆఫిషియల్--పారా షూటింగ్‌గా ఉన్న కోచ్ మీసాల శైలేంద్ర మార్గదర్శకత్వంలో శిక్షణ అందించనున్నారు. అకాడమీ ద్వారా చిన్నారుల నుంచి పెద్దల వరకు షూటింగ్ క్రీడలో ఆసక్తి ఉన్న వారికి సరైన శిక్షణ, ఫోకస్, ఏకాగ్రత, సాంకేతిక నైపుణ్యాలు, పోటీ స్థాయి సామర్థ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం కల్పించనున్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారులు రాణించేలా మార్గనిర్దేశం చేయడం అకాడమీ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ‘మాస్టర్ యువర్ ఫోకస్ । షార్పెన్ యువర్ ఎయిమ్’ అనే నినాదంతో ముందుకు సాగుతున్న ఈ అకాడమీ బోడుప్పల్ ప్రాంతంలో షూటింగ్ క్రీడాభివృద్ధికి ఒక ముఖ్యమైన వేదికగా నిలవనుంది.

**అకాడమీ వివరాలు:**

పీక్ ప్రెసిషన్ షూటింగ్ అకాడమీ. చిరునామా: బోడుప్పల్ డిపో ఎదురుగా, శ్రీ లక్ష్మీ నరసింహ జ్యువెల్లరీ పైభాగంలో, బుధానగర్ రోడ్ నం.1, బోడుప్పల్--500092. సంప్రదించండి:శైలేంద్ర 9885557883.

# కబ్జాలపై కఠినంగా వ్యవహరించాలి

**సిబిసి ఆస్తులను కాపాడుకోవాలి**
**భవిష్యత్ తరాలకు కోసం సేవలందిస్తున్న సిబిసి సంఘం**
**రాజకీయ ప్రజా ప్రతినిధులు సహకారం అందించాలి**
**కోర్టు ఉత్తర్వులను పాటించాలి**
**న్యాయ పోరాటంలో ఎన్నటికున్న న్యాయం మాత్రమే గెలుస్తుంది**
**సిబిసి ఆస్తుల కబ్జాలపై స్పందించిన దేవరకొండ శ్రావణ్ కుమార్**




**హన్మకొండ జై భీమ్ న్యూస్:**

హన్మకొండలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ కు సంబంధించిన మిషనరీ ఆస్తులను కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరు కదిలి రావాలని హన్మకొండ ప్రాంతానికి చెందిన దేవరకొండ శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు.ఆగస్టు 30 ఆదివారం మధ్యాహ్నం సీబీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడిన భారీ ర్యాలీలో పాల్గొని తన మద్దతు తెలిపాడు.సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ జిజె నిరంజన్ బాబును ప్రత్యేకంగా కలిసి ఆశీర్వాదం తీసుకొని సిబిసి ఆస్తుల కబ్జాలకు కారకలవుతున్న వ్యక్తులకు వ్యతిరేకంగా నిర్వహించబడుతున్న నిరసనలు, ర్యాలీల, కొరకు యువతను సమకూర్చడంలో ప్రత్యేక చొరవ తీసుకోగలనని హామీ ఇచ్చినట్టు తెలిపాడు.కబ్జాల బారి నుండి క్రైస్తవ సంఘాన్ని సిబిసి ఆస్తులను రక్షించుకోవడం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా క్రైస్తవ సంఘాలన్నీ ఏకం కావాలని కోరినాడు.సిబిసి సంఘ పెద్దలు చేస్తున్న సిబిసి ఆస్తుల రక్షణ న్యాయపోరాటానికి సంపూర్ణంగా మద్దతునివ్వడమే కాకుండా ప్రతి కార్యక్రమంలో పాల్గొని ఆస్తుల రక్షణ కొరకు నిలబడగలమని తన ధీమా వ్యక్తం చేశాడు.

# రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ కొరడా!

**తిరుమల ఇండస్ట్రీస్‌లో 340 టన్నుల బియ్యం గుర్తింపు.. డీలర్లు, మిల్లు యాజమాన్యం పాత్రపై విచారణ**

**హుజూరాబాద్, 30 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

హుజూరాబాద్ మండలంలో రేషన్ బియ్యం అక్రమ నిల్వల వ్యవహారం కలకలం రేపుతోంది. పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సివిల్ సప్లైస్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామంలోని తిరుమల ఇండస్ట్రీస్ రైస్ మిల్లుపై ఆదివారం తెల్లవారుజామున సుమారు 5 గంటలకు దాడులు చేపట్టారు. ఈ తనిఖీల్లో మిల్లులో భారీగా నిల్వ ఉంచిన సుమారు 340 టన్నుల బియ్యాన్ని అధికారులు గుర్తించినట్లు సమాచారం. బియ్యం నిల్వకు సంబంధించిన రికార్డులు, సరఫరా వివరాలు, రవాణా మార్గాలు, బియ్యం మిల్లుకు చేరిన విధానంపై అధికారులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ట్రాలీ డ్రైవర్ తిరుపతి సురేష్ నుంచి అధికారులు కీలక సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. జమ్మికుంట, ఇల్లందకుంట, హుజూరాబాద్ మండలాల్లోని వివిధ ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి మిల్లుకు తరలించినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. అలాగే హుజూరాబాద్ మండలంలోని ఇప్పల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఓ రేషన్ డీలర్ నుంచి కూడా బియ్యం తీసుకొచ్చినట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. రేషన్ బియ్యాన్ని మిల్లుకు తరలించిన అనంతరం రీసైక్లింగ్ చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద ప్రభుత్వానికి చూపించే ప్రయత్నం జరిగిందా? అనే కోణంలోనూ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. బియ్యం ఎక్కడి నుంచి సేకరించారు, ఎవరి ద్వారా మిల్లుకు చేరింది, నిల్వలకు సంబంధించిన రికార్డులు ఉన్నాయా, ఈ వ్యవహారం వెనుక ఎవరెవరి ప్రమేయం ఉందనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంలో మిల్లు యాజమాన్యం, రేషన్ డీలర్లు, బియ్యం సేకరించే వ్యాపారులు, రవాణాదారుల పాత్రపై కూడా విచారణ కొనసాగుతోంది. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం రేషన్ బియ్యం అక్ర మ నిల్వల వెనుక అసలు వ్యవహారం ఏమిటి? ఇందులో ఎవరి పాత్ర ఎంత? అనే విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. విచారణ పూర్తయిన తర్వాత బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.



# తీజ్ వేడుకల్లో ‘బంజారా క్వీన్స్

**సాంప్రదాయ నృత్యాలతో అదరగొట్టిన ఇద్దరు భామలు!**
**హీరోయిన్లను తలపించే అందం..**
**కెమెరా కంటికి చిక్కిన అందాల సొగసులు!**



**బడంగ్‌పేట్(జై భీమ్ న్యూస్)**

బడంగ్‌పేట్ తీజ్ సంబరాల్లో ఆ ఇద్దరు బంజారా ముద్దుగుమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాంప్రదాయ దుస్తుల్లో సంస్కృతికి అద్దంపట్టేలా వారిద్దరూ వేదికపైకి రాగానే ఒక్కసారిగా ప్రాంగణమంతా సినీ తారల గ్లామర్ పరుచుకున్నట్లు అనిపించింది. ?తీజ్ పాటకు తగ్గట్లుగా గవ్వల సవ్వడులు మోగుతుంటే.. ఒకరి అడుగుకు మరొకరు లయబద్ధంగా జతకలుపుతూ ఆ ఇద్దరు యువతులు చేసిన బంజారా నృత్యం చూపరులను కట్టిపడేసింది. ముఖంలో చెరగని చిరునవ్వు, కళ్లలో తొణికిసలాడే ఆత్మవిశ్వాసం, ఆభరణాల మెరుపులతో పోటీపడుతూ వారు పలికించిన అందమైన హావభావాలు కెమెరా కంటికి అద్భుతమైన ఫ్రేములుగా దొరికాయి. ఆధునిక కాలంలోనూ తమ సంస్కృతిని ఇంతటి స్టైలిష్‌గా, గ్రేస్‌తో చాటిచెబుతూ వేడుకల్లో అసలైన జోష్ నింపిన ఆ ఇద్దరు భామల నృత్యానికి అతిథులు సైతం ఫిదా అయ్యారు. భవిష్యత్ తారలను తలపించేలా మెరిసిన ఆ ఇద్దరు యువతులను పలువురు జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు తమ కెమెరాల్లో పోటీపడి బంధించారు. ఈ వేడుకలకు హాజరైన పలువురు ప్రముఖ నాయకులు బెల్లయ్య నాయక్ సైతం వారి ప్రతిభకు ముగ్ధులై వెళ్తున్న వాహనాన్ని ఆపి ఆ యువతులతో ఉత్సాహంగా సెల్ఫీలు దిగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేడుకలను ఉర్రూతలూగించిన ఆ ఇద్దరు ముద్దుగుమ్మలు స్వయానా అక్కాచెల్లెళ్లు కావడం, ప్రముఖ బంజారా ఉద్యమకారిణి కుమార్తెలు కావడం విశేషం.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# విధులు వెనక్కి... 'కీర్తి' కోసం పరుగులు..!?

**ప్రజా పనులకు జాప్యం.. 'ప్రత్యేక' పనులకు మాత్రం వేగం..?**
**కాజీపేట సర్కిల్ బల్దియాలో ఆర్ఐ పనితీరుపై ఆరోపణలు...**




**కాజీపేట, 30 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన అధికారి, ప్రజా విధుల కంటే వ్యక్తిగత ప్రాధాన్యత ఉన్న పనులపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారన్న ఆరోపణలు కాజీపేట సర్కిల్ బల్దియాలో చర్చనీయాంశంగా మారాయి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి పనితీరుపై సిబ్బంది, స్థానికులు పలు ప్రశ్నలు సంధిస్తున్నారు. విధుల్లో భాగంగా పరిశీలించాల్సిన ఫైళ్లు, దరఖాస్తులు, ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని కొందరు ఆరోపిస్తున్నారు. అయితే తనకు వ్యక్తిగతంగా ప్రాధాన్యత ఉన్న వ్యవహారాల విషయంలో మాత్రం చురుకుదనం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**"విధులు ఎక్కడ... ప్రత్యేక శ్రద్ధ ఎక్కడ?"**

ఒక ప్రభుత్వ ఉద్యోగి తనకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించడం ప్రధాన బాధ్యత. ముఖ్యంగా రెవెన్యూ విభాగానికి సంబంధించిన అంశాల్లో చిన్నపాటి జాప్యం కూడా ప్రజలకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా విధుల కంటే వ్యక్తిగత ప్రాధాన్యతలకు పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలు వస్తుండటం చర్చకు దారితీస్తోంది. తన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలనే ఉద్దేశంతో కొన్ని వ్యవహారాల్లో అత్యుత్సాహం చూపుతున్నారనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. "కీర్తి కోసం ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధం – కీర్తి కోసం ఎంతైనా ఖర్చు చేయడానికి సిద్ధం " అనే వ్యాఖ్యలు సైతం సర్కిల్ పరిధిలో వినిపిస్తున్నట్లు సమాచారం. పెండింగ్ ఫైళ్లపై సమాధానం ఎవరిది? ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడితే బాధ్యత ఎవరిది? ఫైళ్లు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? ఏ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు? ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంత సమయం కేటాయిస్తున్నారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చకు వస్తున్నాయి. అయితే ఇవన్నీ ఆరోపణలు మాత్రమేనా? లేక వాస్తవంగా విధుల నిర్వహణలో నిర్లక్ష్యం జరుగుతోందా? అన్నది బల్దియా ఉన్నతాధికారుల సమీక్షలో తేలాల్సి ఉంది. కాజీపేట సర్కిల్‌లో వినిపిస్తున్న ఈ ప్రశ్నలకు బల్దియా ఉన్నతాధికారుల సమాధానం ఏమిటో వేచి చూడాలి.

# శ్రీ సత్యసాయి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

**ముగ్గురు యువకుల దుర్మరణం**
**బైక్ చెట్టును ఢీకొట్టి ముగ్గురు యువకుల మృతి**
**ప్రమాదం తర్వాత దగ్ధమైన ద్విచక్ర వాహనం**
**మృతులు పుట్టపర్తి, కొత్తచెరువు, గోరంట్ల వాసులుగా గుర్తింపు**
**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**




**జై భీమ్ న్యూస్, సత్యసాయి జిల్లా**

ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే బైక్‌లో మంటలు చెలరేగడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ విషాదకర ఘటన శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా, నల్లమాడ మండలం అరవవాండ్లపల్లి వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ క్రమంలో బైక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి వాహనం పూర్తిగా కాలిబూడిదైంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం జరిగిన తీరుపై స్థానికులను అడిగి వివరాలు సేకరించారు. మృతులను పుట్టపర్తికి చెందిన అనిల్, కొత్తచెరువు వాసి అర్జున్, గోరంట్లకు చెందిన దీక్షిత్‌గా పోలీసులు గుర్తించారు. అనంతరం ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఒకే ప్రమాదంలో ముగ్గురు యువకులు మరణించడంతో వారి కుటుంబాల్లో, ఆయా గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

# మిషనరీ భూములపై కన్నేసిన కబ్జాకోరు






**సీబిసి ఆస్తుల రక్షణ కోసం భారీ ర్యాలీ నిర్వహించిన సంఘస్తులు.**
**పలు సందర్భాలుగా భూకబ్జాలకు పాల్పడుతున్న మండల శ్రీనివాస్ రెడ్డి.**
**మిషనరీ సేవా పరిచర్యను తీవ్రంగా ఆటంక పరుస్తున్నాడు.**
**150 సంవత్సరాల సేవా పరిచర్యలను అడ్డగిస్తున్నాడు.**
**క్రైస్తవ ఆస్తుల జోలికి వస్తే సహించేది లేదు.**
**కోర్టు కేసుల ధిక్కరణకు పాల్పడుతున్న మండల శ్రీనివాస్ రెడ్డి.**
**నూతన త్రి నగర క్రైస్తవ కమిటీ ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నాం.**
**క్రైమ్ నెంబర్ 223/2016 మండల శ్రీనివాస్ రెడ్డిపై కేసు నమోదు చేయబడినది.**
**సిఎస్ నెంబర్ 124/1994 ఉత్తరువులను లెక్కచేయని మండల.శ్రీనివాస్ రెడ్డి.**
**సీబిసి ఆస్తుల రక్షణకు అన్ని వర్గాలు సహకరించాలి.**
**కబ్జాదారులపై సిపి శ్వేతా రెడ్డి కఠినమైన చర్యలు తీసుకోవాలని సంఘస్తుల విజ్ఞప్తి చేస్తున్నారు.**
**హన్మకొండ సీబిసి సంఘస్తుల ఆవేదన.**

**హన్మకొండ జై భీమ్ న్యూస్:-**

మిషనరీ ఆస్తులను కబ్జాలు చేస్తున్న వ్యక్తిపై కఠినమైన చర్యలు తీసుకోవాలంటూ హన్మకొండ సెంటినరీ బాప్టిస్ట్ సంఘం విశ్వాసులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి కదం తొక్కారు.క్రైస్తవ మిషనరీ ఆస్తులపై జరుగుతున్న బలవంతపు భూకబ్జాలపై ఉక్కుపాదం మోపే వరకు నిరసనలు, శాంతియుత ర్యాలీలు నిర్వహిస్తామంటూ భూకబ్జాదారున్ని హెచ్చరించారు.స్థానిక ప్రజాప్రతినిధులు వాళ్ల సహకారం అందిస్తున్నప్పటికిని భూకబ్జాదారుడు కబ్జాలకు పాల్పడడం అత్యంత దారుణమని తెలియజేశారు. 150 సంవత్సరాల మిషనరీ సేవా పరిచర్యలను ఆటంకపరిచేందుకు అడ్డగించేందుకు కొందరు భూకబ్జాదారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని హన్మకొండ సెంటినరీ బాప్టిస్ట్ సంఘం పెద్దలు సీబిసి సంఘం అధ్యక్షులు డాక్టర్ క్రిస్టోఫర్,సెక్రటరీ, టి.విజయ స్వరూప్,ఇతర సంఘ పెద్దలు తీవ్రంగా ఖండిస్తూ హెచ్చరిస్తున్నారు.1994 నుండి నేటి వరకు 32 సంవత్సరాలుగా సెంటినరీ బాప్టిస్ట్ సంఘానికి సంబంధించిన ఆస్తులపై భూకబ్జాదారులు కొనసాగిస్తున్న కబ్జాలపై కేసులు వేయబడినాయని అందులో భూకబ్జాదారులకు వ్యతిరేకంగా సెంటినరీ బాప్టిస్ట్ సంఘం హన్మకొండకు అనుకూలంగా తీర్పులు వెలువరించబడ్డాయని తెలియజేశారు.గత మూడు సంవత్సరాలుగా హన్మకొండ ప్రాంతానికి చెందిన మండల శ్రీనివాస్ రెడ్డి కొంతమంది భూకబ్జాదారుల ప్రోత్సాహంతో ఇప్పటికే అత్యంత విలువైన క్రైస్తవ మిషనరీ భూములను కబ్జాలు పెట్టి భవనాలు నిర్మించుకొని క్రైస్తవ సేవ పరిచర్యకు తీవ్రమైన ఆటంకాలు సృష్టిస్తున్నాడని దానిని ట్రైసిటీ క్రైస్తవ సంఘాల విశ్వాసులు తీవ్రంగా ఖండిస్తున్నారని తెలిపారు.అందులో భాగంగానే ఆదివారం ఆగస్టు 30న చర్చ్ ముందు ప్రధాన రహదారిపై శాంతియుతమైన భారీ ర్యాలీ నిర్వహించి మిషన్ హాస్పిటల్ కాంపౌండ్ లో పత్రిక సమావేశం నిర్వహించారు.ముందస్తుగానే సెంటినరీ బాప్టి చర్చ్ రిజిస్టర్డ్ అధికార లేకపై హన్మకొండ పోలీస్ స్టేషన్ అధికారికి వినతి పత్రం సమర్పించి ఇప్పటివరకు కోర్టులలో జరిగిన కేసుల వివరాలను మండల శ్రీనివాస్ రెడ్డి ఇతర కొంతమంది వ్యక్తులతో కలిసి కబ్జాల నిర్వహిస్తున్న విధానాలను పరిశీలిస్తూ సంఘస్తులు సమర్పించిన ఆస్తుల ఆధారాలను కోర్టు కేసుల వివరాల ఆధారాలను పరిగణలోనికి తీసుకుంటూ సదరు వ్యక్తి క్రమం తప్పకుండా కబ్జాలకు పాల్పడుతున్న మండల శ్రీనివాస్ రెడ్డి పై అతని అనుచరులపై చట్టపరమైన చర్యలతో పాటు బలవంతపు దౌర్జన్యపు భూ కబ్జాలకు పాల్పడుతున్న విధానాలను పరిగణలోకి తీసుకొని కఠినమైన చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నట్లు తెలియజేశారు.తదనంతరం పత్రికా సమావేశం నిర్వహించి సంఘ కాపరుల సమక్షంలో సంఘ పెద్దలు త్రినగర క్రైస్తవ సంఘ కాపరులు,సంఘ సభ్యులు పాల్గొని వారంతా మాట్లాడుతూ సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ 146 సంవత్సరాల చరిత్ర కలిగిన సంఘంగా గుర్తింపును పొందిందని వేలాది లక్షలాదిమంది పేదలకు సిబిసి సంఘం మిషనరీ ఆధ్వర్యంలో నిరంతర సేవలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.ముఖ్యంగా అనాధలకు విద్యను అందించే క్రమంలో పేదలకు వైద్యాన్ని అందించే క్రమంలో మిషనరీ సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలియజేశారు.సిఎస్ నెంబర్ 124/1994 తేదీ 19/12/2024న మద్రాస్ హైకోర్టు ఇచ్చినటువంటి తీర్పు ఏదైతే ఉందో అట్టి తీర్పు చారిత్రాత్మకమైనదని మిషనరీ ఆస్తుల రక్షణ కోసం క్రైస్తవ ఆస్తుల రక్షణ కోసం అనుకూలమైన తీర్పు రావడం గర్వకారణం అని అట్టి తీర్పులో 78వ డిపెండెంట్గా ఉంటున్నటువంటి మండల శ్రీనివాస్ రెడ్డి కోర్టు కేసులో భాగస్తుడని అట్టి తీర్పును పూర్తిగా ఉల్లంఘిస్తూ తప్పుడు పత్రాలు సృష్టించుకుని భూమిని కబ్జాకు పూనుకుంటున్నాడని వాపోయారు.ఈఏ నెంబర్ 387/2025 అమరావతిలో కేసు వేసుకున్న శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన ఆస్తులపై అమరావతిలో కేసు వేయడమే కాకుండా అమరావతి కోర్టు " స్టే" ఆర్డర్ విధించగా దానిని పూర్తిగా వ్యతిరేకిస్తూ కబ్జాలకు పాల్పడుతున్నాడని హెచ్చరించారు.ఈపీ నెంబర్ 116/2024,16/2003 కేసులో డిస్మిస్,ఎక్స్పర్ట్ ఆర్డర్స్ పొందిన పిటీషనర్ మండల, శ్రీనివాస్ రెడ్డి.కాంటెంప్ట్ పిటిషన్ నెంబర్ 269/2003,89/2003 కేసులలో కోర్టు కేసులు పూర్తయ్యేంతవరకు మౌఖికమౌక జోలికి వెళ్ళనని లిఖితపూర్వకంగా కేసులలోని సారాంశానికి బదులుగా న్యాయస్థానానికి వాంగ్మూలం ఇచ్చి వాటన్నిటిని బేఖతార్ చేస్తూ భూకబ్జాలకు పాల్పడడమే కాకుండా క్రైస్తవ ఆస్తులపై కన్నేసి మద్రాస్ కోర్ట్ మంజూరు చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా దౌర్జన్యపు భూకబ్జాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు పూర్తిగా విఘాతం కలిగిస్తూ కబ్జాలు కొనసాగిస్తున్నాడని అతని బారి నుండి క్రైస్తవ సంఘాన్ని మిషనరీ ఆస్తులను, మిషనరీ సేవను రక్షించాలని కోరడం జరిగింది.అదే సందర్భంలో త్రినగర బాప్టిస్ట్ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నూతన (బాడీని)కమిటీని ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.పేద ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటున్న క్రైస్తవ మిషనరీ సేవలను కలకాలం కొనసాగించడానికి త్రినగర్ క్రైస్తవ విశ్వాసులు అందరు సహకరించాలని కోరారు.మద్రాస్ కోర్టు ఉత్తర్వులు క్రైస్తవ మిషనరీ ఆస్తులను కొనడానికి గాని అమ్మడానికి గాని వీలు లేదని ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొన్నప్పటికిని మిషనరీ ఆస్తులపై అక్రమంగా ఏర్పడిన దస్తావేజులన్నీ రద్దు చేయబడుతున్నాయంటూ ఉత్తర్వుల్లో తెలిపినప్పటికిని సదరు భూకబ్జాదారుడు శ్రీనివాస్ రెడ్డి తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి లక్షల సంఖ్యలో ఉన్న క్రైస్తవులను అన్ని విధాలుగా ఇబ్బందుల పాలు చేస్తున్నాడని గుర్తు చేశారు.క్రైస్తవ సంఘం ఆస్తులను కాపాడుకునే క్రమంలో ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆస్తులను రక్షించుకునే క్రమంలో న్యాయపోరాటంతో పాటు శాంతియుతమైన మార్గంలో ర్యాలీలు, నిరసనలు కొనసాగుతాయని ఆస్తులను కాపాడుకునే క్రమంలో క్రైస్తవులంతా ఐకమత్యాన్ని పాటిస్తూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదని పేర్కొన్నారు.కేవలం ఒక క్రైస్తవ ఆస్తులపై మాత్రమే ఇంతలా దౌర్జన్యపు కబ్జాలు కొనసాగించబడడం చట్టానికి న్యాయస్థానానికి శాంతి భద్రతలకు పూర్తిగా విరుద్ధమని అలాంటి కబ్జాలు కొనసాగిస్తున్న మండల. శ్రీనివాస్ రెడ్డిని కఠినంగా శిక్షించాలని కోరారు.మిషనరీ ఆస్తులను గాని క్రైస్తవస్తులను గాని కబ్జాలకు పాల్పడిన వారు బాగుపడినట్లు చరిత్రలో ఎక్కడ లేదని క్రైస్తవులు విశ్వాసంగా ఆరాధించుకునే సంఘంపై మిషనరీ ఆస్తులపై కబ్జాలకు పాల్పడడం ఇకనైనా మానుకోవాలని లేదంటే వేల సంఖ్యలో లక్షల సంఖ్యలో కబ్జాదారుని కబ్జాలకు వ్యతిరేకంగా నిరసన తెలపాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ భారీ ర్యాలీ పత్రిక సమావేశం కార్యక్రమంలో సెంటినరీ బాప్టిస్ట్ సంఘం సీనియర్ సంఘ కాపరి రెవరెండ్ జిజె నిరంజన్ బాబు,సంఘ అధ్యక్షులు డాక్టర్ టి. క్రిస్టోఫర్ రూబెన్,సెక్రటరీ టి. విజయ్ స్వరూప్,వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ టి. మోసెస్ క్రిస్టోఫర్,వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కే. విద్యాకర్, కోశాధికారి బి.విజయ్ కుమార్,జాయింట్ సెక్రెటరీ జె. డానియల్,జాయింట్ సెక్రటరీ,ఎన్. జాన్సన్ ప్రసాద్, సంఘ కాపరులు రెవరెండ్ మైకేల్,రెవరెండ్ మోజెస్,రెవరెండ్ రంజిత్ కుమార్,పాస్టర్ ఇస్సాక్,మాజీ కార్పొరేటర్ డిన్న,పాస్టర్ జోసఫ్ ప్రభాకర్, టి.ఇమ్మానుయేల్,పులి అనిల్,శ్రవణ్ కుమార్ జై భీమ్ సంస్థల బ్యూరో ప్రతినిధి డాక్టర్ దేవరకొండ. నగేష్ తోపాటు 200 మంది క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.




# అదే పెద్దపులి మళ్లీ వచ్చింది..

**పోలవరం ప్రాజెక్టు వద్ద భయాందోళనలో ప్రజలు**
**పోలవరం ప్రాజెక్టు సమీపంలో పులి సంచారం కలకలం**
**రెండు దూడలపై దాడి చేసి చంపడంతో తీవ్ర భయాందోళన**
**గతంలో పట్టుకుని పాపికొండల్లో వదిలిన పులేనని నిర్ధారణ**
**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ హెచ్చరిక**
**పులిని బంధించేందుకు రంగంలోకి ప్రత్యేక నిపుణుల బృందాలు**

**ఏలూరు, జై భీమ్ న్యూస్**

ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు సమీపంలో పెద్దపులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రాజెక్టు పరిధిలోని దేవరగొండి జంట టన్నెళ్ల వద్ద పులి తిరుగుతుండటంతో స్థానిక గ్రామ ప్రజలు, ప్రాజెక్టు సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. రెండు దూడలను చంపేయడంతో ఈ భయం మరింత పెరిగింది. అటవీ శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి పులిని బంధించేందుకు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే, శనివారం రాత్రి పోలవరం ప్రాజెక్టు పాత దేవరగుండి టన్నెల్ వద్ద ఉన్న రెగ్యులేటర్ సమీపంలో స్థానికులు పులిని గమనించారు. అక్కడే ఉన్న రెండు దూడలపై అది దాడి చేసి చంపేసింది. ఈ ఘటనతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. ఆదివారం ఉదయం ముంపు గ్రామమైన దేవరగొండిలోని జంట టన్నెళ్ల వద్ద కూడా పులి కదలికలను అధికారులు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు ప్రాజెక్టు ఇంజనీర్లు, ఏజెన్సీ ప్రతినిధులు, స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**గతంలో పట్టుబడి, మళ్లీ ప్రత్యక్షం**

ఈ ఏడాది జనవరిలో ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోకి ప్రవేశించిన ఈ పులి, అప్పట్లో బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోనూ సంచరించి కలకలం రేపింది. ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లా అడవుల్లోకి వెళ్లింది. రాయవరం సమీపంలో దీని సంచారం ఎక్కువ కావడంతో, పుణే నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఫిబ్రవరిలో దీనిని సురక్షితంగా పట్టుకుంది. అనంతరం పులిని విశాఖపట్నం జూకు తరలించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆధునిక కాలర్ ఐడీని అమర్చారు. పోలవరం ప్రాంతంలోని పాపికొండల అభయారణ్యంలో దానిని తిరిగి వదిలిపెట్టారు. అయితే, అది అభయారణ్యానికే పరిమితం కాలేదు. ఏప్రిల్ 14న గోదావరి నదిని దాటి కొట్టూరు ముంపు గ్రామంలోకి ప్రవేశించి, అప్పటి నుంచి ఏలూరు, పోలవరం, తూర్పుగోదావరి జిల్లాల మధ్య సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది.



# ఇంటి నంబర్లు కోల్పోయిన బాధితులకు న్యాయం ఎప్పుడు?

**బల్దియా డిప్యూటీ కమిషనర్ తీరుపై బాధితుల ఆగ్రహం**
**ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం లేదని ఆవేదన**
**మున్సిపల్ కమిషనర్ తక్షణ జోక్యానికి విజ్ఞప్తి**




**వరంగల్, 30 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో ఇంటి నంబర్ల కేటాయింపు, తొలగింపు వ్యవహారం వివాదానికి దారితీసింది. కాశిబుగ్గ సర్కిల్ పరిధిలోని పైడిపల్లి శివారు కత్తెరశాల లక్ష్మీకాంత్ కాలనీలో సుమారు 600 గజాల స్థలానికి సంబంధించి గతంలో తమకు కేటాయించిన ఇంటి నంబర్లను తొలగించడంపై బాధితులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమ హక్కులకు సంబంధించిన పత్రాలు, పాత రికార్డులు ఉన్నప్పటికీ బల్దియా అధికారులు తమకు న్యాయం చేయడం లేదని వారు ఆరోపిస్తున్నారు. బాధితుల వివరాల ప్రకారం.. మంజుల, కుమారస్వామి, రాజు తదితరులకు సంబంధించి గతంలో ఇంటి నంబర్లు కేటాయించబడ్డాయి. ఆస్తి పన్నులు, ఇతర సంబంధిత రికార్డులు కూడా ఉన్నాయని వారు చెబుతున్నారు. అయితే అనంతరం తమ ఇంటి నంబర్లను తొలగించి, మరో వ్యక్తికి సంబంధించిన ఇంటి నంబర్ వ్యవహారాన్ని కొనసాగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ప్రజావాణిలో ఫిర్యాదులు సమర్పించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని బాధితులు అంటున్నారు. తాజాగా మళ్లీ నోటీసులు జారీ కావడంతో వివాదం మరింత ముదిరిందని పేర్కొంటున్నారు.

**సర్వే నంబర్లపై స్పష్టత ఏది?**

వివాదానికి ప్రధాన కారణంగా సర్వే నంబర్లలో ఉన్న వ్యత్యాసాన్ని బాధితులు ప్రస్తావిస్తున్నారు. తమ వద్ద ఉన్న సర్వే సంబంధిత నివేదికల్లో 624/1/2 నంబర్ ఉండగా, బల్దియా నోటీసుల్లో 527/బి సర్వే నంబర్ ప్రస్తావనకు రావడంపై వారు ప్రశ్నిస్తున్నారు. ఒకే స్థలానికి సంబంధించి వేర్వేరు సర్వే నంబర్లు ఎలా నమోదయ్యాయి? ఏ రికార్డు ఆధారంగా ఇంటి నంబర్ కేటాయించారు? గతంలో మంజూరు చేసిన ఇంటి నంబర్లను ఏ నిబంధనల ప్రకారం తొలగించారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. పాత మ్యూటేషన్ రికార్డులు, ఇంటి నంబర్ల కేటాయింపు ఫైళ్లు, సర్వే నివేదికలు, ఆస్తిపన్ను రికార్డులు, నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన పత్రాలను సమగ్రంగా పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు చెబుతున్నారు.

**డిప్యూటీ కమిషనర్‌పై ఉన్నతస్థాయి విచారణ జరపాలి**

తమకు ఎదురైన సమస్యకు బల్దియా అధికారుల నిర్ణయాలే కారణమని ఆరోపిస్తున్న బాధితులు సంబంధిత డిప్యూటీ కమిషనర్ వ్యవహారశైలిపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంటి నంబర్ల తొలగింపు, నోటీసుల జారీ, సంబంధిత ఫైళ్లలో తీసుకున్న నిర్ణయాలపై సమగ్రంగా విచారణ జరపాలని కోరుతున్నారు. విచారణలో నిబంధనల ఉల్లంఘన, అధికార దుర్వినియోగం లేదా బాధ్యతారాహిత్యం తేలితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు అవసరమైతే చట్టపరమైన చర్యలు కూడా తక్షణమే చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

**"ఏళ్లుగా మానసిక వేదన అనుభవిస్తున్నాం"**

సమస్య పరిష్కారం కోసం పలుమార్లు బల్దియా కార్యాలయాలను ఆశ్రయించినా ఫలితం లేకపోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించాల్సిన అధికారుల తీరుతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. "మా ఇంటి నంబర్ల విషయంలో ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఫిర్యాదులు చేసినా స్పష్టమైన పరిష్కారం చూపడం లేదు. ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి పంపుతున్నారు. దీనివల్ల ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా సమస్యపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించాలి" అని బాధితులు కోరుతున్నారు.

**కమిషనర్ స్వయంగా జోక్యం చేసుకోవాలి**

ఈ వివాదంపై బల్దియా కమిషనర్ స్వయంగా దృష్టి సారించి సంబంధిత ఫైళ్లను తెప్పించుకుని పరిశీలించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. సర్వే నంబర్లు, ఇంటి నంబర్ల కేటాయింపు, తొలగింపు ప్రక్రియకు సంబంధించిన పూర్తి రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని కోరుతున్నారు. అధికారుల నిర్ణయాల కారణంగా తాము అనవసరంగా ఇబ్బందులు, మనోవేదనకు గురవుతున్నామని, ఇకనైనా కమిషనర్ జోక్యం చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు అన్యాయం జరిగిందని విచారణలో తేలితే ఇంటి నంబర్లను పునరుద్ధరించడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సంబంధిత డిప్యూటీ కమిషనర్‌పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

**బాధితుల డిమాండ్లు**

ఇంటి నంబర్ల తొలగింపు వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి.

624/1/2, 527/బి సర్వే నంబర్లపై రికార్డులను పరిశీలించాలి.


గతంలో జారీ చేసిన ఇంటి నంబర్ల ఫైళ్లను పూర్తిగా పరిశీలించాలి.


డిప్యూటీ కమిషనర్ నిర్ణయాలపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలి.


తప్పిదం తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.


అవసరమైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలి.

ప్రజావాణి ఫిర్యాదుపై కమిషనర్ స్వయంగా సమీక్షించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలి.


Citizen Copy
GOVERNMENT OF TELANGANA
MAHATMA JYOTHIBA PHULE PRAJA BHAVAN
PRAJAVANI RECEIPT


ఈ విషయం వాస్తవ పరిస్థితులకు పూర్తిగా విరుద్ధంగా ఉంది. ఏడీ సర్వే నివేదికలో కూడా మా భూమి సర్వే నం. 624లో ఉన్నట్లు స్పష్టంగా చూపించబడింది. సంబంధిత సర్వే నివేదికను అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ, దానిని సరైన విధంగా పరిగణనలోకి తీసుకోకుండా మా ఇంటి నంబర్లను రద్దు చేయడం వల్ల మాకు తీవ్ర అన్యాయం జరిగింది.
అందువల్ల, దయచేసి:
1. సర్వే నం. 624లో ఉన్న మా భూమి మరియు ఇంటిని ప్రత్యక్షంగా పరిశీలించాలి.
2. ఏడీ సర్వే నివేదికను పూర్తిగా పరిశీలించాలి.


3. సర్వే నం. 527లో వాస్తవంగా భూమి/ఇల్లు ఉందా లేదా సంబంధిత అధికారుల ద్వారా నిర్ధారించాలి.
4. రామస్వామి వెంకటరెడ్డి అనే వ్యక్తి భూమి కొన్నపుడు ఎవరి ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడో వారి జీపీఏ ను పట్టాదారుడు జీపీఏ ను క్యాన్సిల్ చేసినాడు.
ధన్యవాదములతో


CM PRAJAVANI @ PRAJABHAVAN
Date: 07/08/2026
MAHATMA JYOTHIBA PHULE PRAJA BHAVAN

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి.. అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమేనన్న టీపీసీసీ చీఫ్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

## గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రజాభవన్‌లో ప్రత్యేక అధికారి కార్యాలయం

**హైదరాబాద్, 30 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**





వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ప్రజాభవన్‌లోని రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారి కార్యాలయాన్ని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారులతో కలిసి కార్యాలయంలోని వివిధ విభాగాలను మంత్రి పరిశీలించారు. అనంతరం ప్రత్యేక అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన కాన్ఫరెన్స్ హాలులో పుష్కర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ, తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు అనే స్థాయిలో రాష్ట్ర ప్రత్యేకతను దేశవ్యాప్తంగా చాటిచెప్పేలా ఏర్పాట్లు ఉండాలని మంత్రి సురేఖ అధికారులకు సూచించారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వసతులు కల్పించాలని ఆదేశించారు.

**సమన్వయ కేంద్రంగా ప్రత్యేక అధికారి కార్యాలయం**

పుష్కరాలకు తరలివచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఘాట్ల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా, మౌలిక వసతులు తదితర అంశాలపై వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థలు, దేవాదాయ శాఖల మధ్య సమన్వయం చేసేందుకు ప్రత్యేక అధికారి కార్యాలయం కీలక కేంద్రంగా పనిచేస్తుందని మంత్రి తెలిపారు. పుష్కరాల ఏర్పాట్ల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**రూ.1,000 కోట్ల నిధులు**

గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.1,000 కోట్ల నిధులు మంజూరు చేయడం అభినందనీయమని మంత్రి సురేఖ అన్నారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన పుష్కర యాత్రను అందించేలా ముందస్తు ప్రణాళికతో పనులు చేపడుతున్నామని తెలిపారు. టైర్--1, టైర్--2 పరిధిలో సుమారు 2 కిలోమీటర్ల మేర ఘాట్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, టైర్--1, 2, 3 పరిధిలో మొత్తంగా 5 కిలోమీటర్లకు పైగా ఘాట్లు నిర్మించనున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు నిధులు విడుదలైనట్లు, వైద్య, పోలీస్, పర్యాటక శాఖలకు కూడా నిధులు మంజూరైనట్లు తెలిపారు.

**నాణ్యతకు పెద్దపీట**

గోదావరి పుష్కరాల కోసం చేపట్టే నిర్మాణాల్లో నాణ్యత, పటిష్టతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఇటీవల నేపాల్‌లో భారీ వరదల సమయంలోనూ చెక్కుచెదరకుండా నిలిచిన ఓ ఇంటిని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, పుష్కరాల పనులను హడావుడిగా కాకుండా నాణ్యతతో చేపట్టాలని సూచించారు. పాత ఘాట్లను పటిష్టం చేయడంతో పాటు కొత్త ఘాట్లను దీర్ఘకాలం ఉపయోగపడేలా నిర్మించాలని అన్నారు. భక్తులు స్నానాలు చేసే ప్రాంతాల్లో నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నప్పుడు ప్రమాదాలు జరగకుండా గ్రిల్స్‌ను పటిష్టంగా ఏర్పాటు చేయాలని, మహిళలకు బట్టలు మార్చుకునే సౌకర్యాలను కూడా పకడ్బందీగా కల్పించాలని సూచించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధి పనులతో పాటు పుష్కరాల ఏర్పాట్లు కూడా భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, ఆర్జేసీ రామకృష్ణారావు, డీసీ కృష్ణ ప్రసాద్‌తో పాటు దేవాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. ప్రజాభవన్‌కు వచ్చిన మంత్రి సురేఖకు అర్చకులు, పండితులు వేదమంత్రోచ్ఛారణతో స్వాగతం పలికారు.

## మహంకాళి దేవస్థానంలో మంత్రి కొండా సురేఖమ్మ కుటుంబ సభ్యుల పేరుపైన అర్చన

**మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న యువజన కాంగ్రెస్ కొండా యువసేన రాష్ట్ర నాయకులు సిలివేరు**

**హైదరాబాద్ : (జై భీమ్ న్యూస్)**



శ్రావణమాసం మూడవ ఆదివారం శుభ సందర్భంగా ఎల్బీనగర్ వనస్థలిపురంలోని శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖమ్మ కుటుంబ సభ్యుల పేర్లపైన అర్చన చేసి ఆయురారోగ్య అష్టైశ్వర్య సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు చల్లగా వర్ధిల్లాలని వర్షాలు సమృద్ధిగా పడి రైతన్నలు పాడిపంటలతో పల్లెలు పచ్చని వెలుగులతో కళకళలాడుతూ వెల్లువిరియాలనుప్రజలకు మరెన్నో సేవలు చేయాలని రాజకీయంలో ఎటువంటి వడిదొడుకులు లేకుండా సాఫీగా ప్రయాణం సాగాలని ఆ అమ్మవారిని యువజన కాంగ్రెస్ కొండా యువసేన రాష్ట్ర నాయకులు సిలివేరు అనిల్ వేడుకున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# ‘మన్ కీ బాత్’లో కడప రైతు.. వరదారెడ్డికి ప్రధాని మోదీ కితాబు

**‘మన్ కీ బాత్’లో కడప రైతు వరదారెడ్డికి ప్రధాని మోదీ ప్రశంస**
**సంప్రదాయ పంటలకు బదులుగా అవకాడో సాగుతో సక్సెస్**
**నూతన ఆలోచనలకు వరదారెడ్డి ఉదాహరణ అని కొనియాడిన ప్రధాని**
**ప్రధాని ప్రశంసలపై ఆనందం వ్యక్తం చేసిన రైతు**
**గ్రామ ప్రజలతో కలిసి సంబరాలు చేసుకున్న వరదారెడ్డి**



**కడప, జై భీమ్ న్యూస్**

కడప జిల్లాకు చెందిన ఓ సాధారణ రైతు ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. సంప్రదాయ పంటలకు భిన్నంగా అవకాడో సాగు చేస్తూ విజయం సాధించిన లింగాల మండలం వెలిదండ్ల గ్రామ రైతు కర్ణ వరదారెడ్డిని ప్రధాని మోదీ తన ‘మన్ కీ బాత్’ కార్యక్రమంలో అభినందించారు. ఈయన స్ఫూర్తిదాయక ప్రస్థానాన్ని దేశ ప్రజలకు పరిచయం చేశారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. “ఏళ్ల తరబడి టమాటా, అరటి వంటి పంటలు సాగు చేసిన వరదారెడ్డి, ఓసారి తన స్నేహితుడి పొలంలో అవకాడో పంటను చూశారు. ఆ తర్వాత యూట్యూబ్ ద్వారా సాగు వివరాలు తెలుసుకుని, విజయవంతంగా 4 టన్నుల దిగుబడి సాధించారు. స్థానిక మార్కెట్లకే నేరుగా సరఫరా చేస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. మన రైతుల నూతన ఆలోచనలు వ్యవసాయాన్ని లాభసాటిగా ఎలా మారుస్తున్నాయో చెప్పడానికి వరదారెడ్డి ఒక ప్రత్యక్ష ఉదాహరణ” అని కొనియాడారు. ఈ సందర్భంగా రైతు వరదారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. “గతంలో సాగు చేసిన పంటలతో చాలా నష్టపోయాను. అందుకే అవకాడో సాగుకు మొగ్గుచూపాను. ఈ మొక్కలు ఎక్కడ దొరుకుతాయి, వాటికి వచ్చే తెగుళ్లు, వాడాల్సిన ఎరువులపై అవగాహన పెంచుకుని సాగు మొదలుపెట్టాను. నాలుగేళ్లకు ఒకటిన్నర టన్నుల దిగుబడి వచ్చింది. కిలో రూ.100 చొప్పున చుట్టుపక్కల ప్రాంతాల్లోనే విక్రయించాను. ‘మన్ కీ బాత్’లో ప్రధాని మోదీ నన్ను అభినందించడం చాలా ఆనందంగా ఉంది. ఈ సంతోషాన్ని గ్రామ ప్రజలతో పంచుకున్నాను” అని ఆయన తెలిపారు.

# వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ విజయవంతం..

**హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్న కృష్ణా జలాలు.. !**
**సంతృప్తికరంగా ముగిసిన వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ రన్**
**కొల్లం వాగు వద్ద గేట్లు ఎత్తి సొరంగంలోకి కృష్ణా జలాల విడుదల**
**రేపు ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్న సీఎం చంద్రబాబు**
**ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల కరవు ప్రాంతాలకు తీరనున్న నీటి కష్టాలు**






**ప్రకాశం, జై భీమ్ న్యూస్**

ప్రకాశం జిల్లాతో పాటు పలు జిల్లాల దశాబ్దాల సాగు, తాగునీటి కలను సాకారం చేసే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించి అధికారులు ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టంతో కరవు సీమలో ఆనందం వెల్లివిరుస్తోంది. ఆదివారం ఉదయం అధికారులు కొల్లం వాగు వద్ద ప్రాజెక్టు గేట్లను ఎత్తి సొరంగ మార్గంలోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గేట్ల పనితీరు, సొరంగంలో నీటి ప్రవాహ వేగాన్ని, నీటి తరలింపు ప్రక్రియను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. సొరంగంలో పరుగులు తీసిన కృష్ణా జలాలు గంటవానిపల్లి క్రాస్ హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా రెగ్యులేటర్ వద్ద సైరన్ మోగించి సమీప ప్రజలను అప్రమత్తం చేశారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. శ్రీశైలం జలాశయం ముందు భాగం నుంచి సుమారు 43.5 టీఎంసీల కృష్ణా వరద జలాలను తరలించి, నల్లమల సాగర్‌లో నిల్వ చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించనున్నారు. ముఖ్యంగా మార్కాపురం వంటి పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల నీటి కష్టాలకు ఈ ప్రాజెక్టుతో శాశ్వత పరిష్కారం లభించనుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

# పాతుకుపోయాం... మమ్మల్ని కదిలించే వారే లేరు!

**గ్రేటర్ వరంగల్ బల్దియాలో ఆర్ఐల ఏళ్ల తరబడి తిష్ట?**
**నిబంధనలకు తూట్లు.. ఫైళ్ల పెండింగ్.. చేతివాటంపై గుసగుసలు**
**వరుస కథనాలు వస్తున్నా అధికారుల మౌనం ఎందుకు?**
**కమిషనర్ సార్ ఒకసారి ఇటువైపు చూడండి అంటూ బాధితుల విజ్ఞప్తి.**

**వరంగల్, 30 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొంతమంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐ) ఏళ్ల తరబడి ఒకే శాఖలో, ఒకే ప్రాంతాల్లో పనిచేస్తున్నారన్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. సాధారణంగా ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌ల విషయంలో అమలులో ఉండే నిబంధనలను పక్కనబెట్టి నాలుగు నుంచి ఆరు సంవత్సరాలుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలువురు ఆర్ఐలపై అవినీతి ఆరోపణలు, విధుల్లో నిర్లక్ష్యం, ఫైళ్లను పెండింగ్‌లో ఉంచడం వంటి ఫిర్యాదులు ఉన్నప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**ఫైళ్లు కదలాలంటే ‘చేతివాటం’ తప్పదా?**

బల్దియాలో వివిధ రకాల పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంటి పన్ను, ఇంటి అనుమతులు, నల్లా కనెక్షన్లు, ఇంటి నంబర్ మార్పులు, ఆస్తి వివరాల మార్పులు, ఇతర మున్సిపల్ సేవలకు సంబంధించిన దరఖాస్తులు, ఫైళ్ల విషయంలో జాప్యం జరుగుతోందని బాధితులు వాపోతున్నట్లు తెలుస్తోంది.

**‘పాతుకుపోయాం.. మమ్మల్ని కదిలించే వారే లేరు’ అన్న ధీమా?**

ఏళ్ల తరబడి ఒకే శాఖలో కొనసాగుతున్న కొంతమంది ఉద్యోగుల వ్యవహారశైలిపై సిబ్బంది, ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. బదిలీలు జరిగినా కొందరు తమకు అనుకూలమైన ప్రాంతాల్లోనే కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ‘మేము పాతుకుపోయాం.. మమ్మల్ని కదిలించే వారే లేరు’ అన్న చందంగా కొంతమంది వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి ఉంటే పరిపాలనపై, ప్రజలకు అందాల్సిన సేవలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.




**పోస్టింగ్‌ల వెనుక ‘మతలబు’ ఏమిటి?**

కొన్ని కీలక స్థానాల్లో పనిచేసేందుకు కొంతమంది ఉద్యోగులు ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారన్న గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. తమకు అనుకూలమైన ప్రాంతాలు, శాఖల్లో పోస్టింగ్‌లు పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ఒకసారి కీలక స్థానంలోకి వచ్చిన తర్వాత అక్కడి నుంచి బదిలీ కాకుండా కొనసాగేందుకు వివిధ స్థాయిల్లో ఒత్తిళ్లు, పలుకుబడి ఉపయోగిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ ప్రస్తుతం ఆరోపణలు, ప్రజల్లో వినిపిస్తున్న వాదనలు మాత్రమే. వీటిపై అధికారికంగా విచారణ జరిగి వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**పది రోజులుగా వార్తలు వస్తున్నా స్పందన ఏది?**

బల్దియాలోని ఆర్ఐల వ్యవహారశైలిపై గత కొన్ని రోజులుగా వరుసగా వార్తలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వార్తా కథనాలు, ప్రజల ఫిర్యాదులు అధికారుల దృష్టికి వెళ్లిన తర్వాత కూడా విచారణ ఎందుకు ప్రారంభించలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అధికారికంగా ఖండించవచ్చని, వాస్తవం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**బాధితులకు న్యాయం ఎప్పుడు?**

మున్సిపల్ కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే సాధారణ ప్రజలు గంటల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రజలకు అందాల్సిన సేవలు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం, నిర్ణీత సమయంలో అందేలా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై నిష్పక్షపాత విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదే సమయంలో నిరాధార ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు కూడా తమ వాదనను వెల్లడించే అవకాశం కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

**అధికారుల సమాధానం ఏమిటి?**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒకే చోట దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు, వారి బదిలీ నిబంధనలు, పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల సంఖ్య, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, అవినీతి ఆరోపణలపై జరిగిన విచారణలు వంటి అంశాలను ఉన్నతాధికారులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలకు సేవ చేయాల్సిన కార్యాలయంలో ‘చేతివాటం ఉంటేనే పని’ అన్న అభిప్రాయం ఏర్పడటం ప్రజాస్వామ్య పరిపాలనకు మంచిది కాదు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచుతారా? లేక ఆరోపణలు అలాగే కొనసాగుతాయా? అన్నది వేచి చూడాల్సిందే. ప్రజల ప్రశ్న ఒక్కటే.. “నిబంధనలు అందరికీ సమానమేనా? లేక కొంతమందికి మాత్రమేనా?”

# ఆకస్మిక తనిఖీలు... ఆదేశాలు అమలు కావడం లేదా?

**తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నతాధికారుల తనిఖీలపై సర్వత్రా చర్చ**
**ఏఆర్ఐ, సర్వేయర్‌లపై వచ్చిన ఆరోపణలపై విచారణ ఎక్కడ?**
**పూర్తి వివరాలు వెల్లడించాలని ప్రజల డిమాండ్**

**హన్మకొండ జిల్లా, ఆగస్టు 30 (జై భీమ్ న్యూస్)**

నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఓ తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్‌తో పాటు ఆర్డీఓలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలు, అధికారుల పనితీరు తదితర అంశాలను ఉన్నతాధికారులు పరిశీలించినట్లు సమాచారం. ఇదే సమయంలో కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు అధికారులపై ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలు, ఫిర్యాదులు కూడా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఏఆర్ఐ, సర్వేయర్‌ల పనితీరుపై వచ్చిన ఆరోపణలు ఏమిటి? వాటిపై ఉన్నతాధికారులు ఏ మేరకు విచారణ చేపట్టారు? అనే అంశాలు ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీస్తున్నాయి. తనిఖీల సందర్భంగా సంబంధిత అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. అయితే ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చర్యలకు ఆదేశించినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ ఇప్పటివరకు సంబంధిత అధికారులపై స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంపై ప్రజల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు ఉన్నతాధికారులు ఎలాంటి ఆదేశాలు ఇచ్చారు? ఆ ఆదేశాలను తహసీల్దార్ అమలు చేశారా? అమలు చేసి ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? తీసుకున్న చర్యల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అదే విధంగా ఏఆర్ఐ, సర్వేయర్‌లపై వచ్చిన వినతులు, ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిగిందా? సంబంధిత రికార్డులను పరిశీలించారా? ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరించారా? ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల వివరణ తీసుకున్నారా? అన్న దానిపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. తహసీల్దార్ కార్యాలయాలు నేరుగా ప్రజలకు సంబంధించిన కీలక రెవెన్యూ సేవలను అందించే కార్యాలయాలు కావడంతో అక్కడ పనిచేసే అధికారులపై ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని నిష్పక్షపాతంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంటుంది. అయితే ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చినంత మాత్రాన సంబంధిత అధికారులను తప్పుపట్టడం సరికాదు. పూర్తి స్థాయి విచారణ నిర్వహించి, సంబంధిత రికార్డులను పరిశీలించి, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకు తమ వివరణ ఇచ్చే అవకాశం కల్పించిన అనంతరం వాస్తవాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో అసలు ఏం గుర్తించారు? ఏయే లోపాలు బయటపడ్డాయి? ఏఆర్ఐ, సర్వేయర్‌లపై ఎలాంటి ఫిర్యాదులు ఉన్నాయి? వాటిపై ఎలాంటి విచారణకు ఆదేశించారు? తహసీల్దార్‌కు ఎలాంటి సూచనలు చేశారు? ఆ ఆదేశాలపై ఇప్పటివరకు ఏ చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం వెనుక ప్రధాన ఉద్దేశం కార్యాలయాల పనితీరును మెరుగుపరచడం, ప్రజలకు సకాలంలో రెవెన్యూ సేవలు అందేలా చూడడం, రికార్డుల నిర్వహణలో పారదర్శకతను నిర్ధారించడం, అధికారుల పనితీరును నిబంధనలకు అనుగుణంగా ఉండేలా పర్యవేక్షించడం. అయితే తనిఖీల అనంతరం తదుపరి చర్యలు కనిపించకపోతే ఆకస్మిక తనిఖీల ఉద్దేశమేంటనే ప్రశ్నలు తలెత్తడం సహజం. ఒకవైపు ప్రజల నుంచి ఫిర్యాదులు రావడం, మరోవైపు ఉన్నతాధికారులు స్వయంగా కార్యాలయాన్ని తనిఖీ చేయడం, చర్యలకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం ఉండటం, అయినప్పటికీ తదుపరి చర్యలపై స్పష్టత లేకపోవడం పలు సందేహాలకు తావిస్తోంది. ముఖ్యంగా ఏఆర్ఐ, సర్వేయర్‌లపై వచ్చిన ఆరోపణలు ఏమిటి? ఆ ఆరోపణలకు సంబంధించి ఎలాంటి రికార్డులు ఉన్నాయి? వాటిపై విచారణ ఎక్కడ వరకు వచ్చింది? అనే అంశాలపై సంబంధిత తహసీల్దార్ పూర్తి వివరాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందితే వాటిని అమలు చేసిన తీరుపై కూడా స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఫిర్యాదులు నిజమని నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకు కూడా తమ వివరణ ఇచ్చే అవకాశం కల్పించి పూర్తి స్థాయి విచారణ అనంతరం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో ఆరోపణలు నిరాధారమని తేలితే ఆ విషయాన్ని కూడా




అధికారికంగా వెల్లడించడం ద్వారా సంబంధిత అధికారులపై ఏర్పడిన అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉంది. ఆకస్మిక తనిఖీల్లో ఏయే అంశాలు వెలుగులోకి వచ్చాయి? ఏ లోపాలను గుర్తించారు? ఎవరిపై ఎలాంటి వినతులు, ఫిర్యాదులు అందాయి? ఉన్నతాధికారులు ఎలాంటి ఆదేశాలు ఇచ్చారు? తహసీల్దార్ ఆ ఆదేశాలపై ఏ చర్యలు చేపట్టారు? ఇప్పటివరకు తీసుకున్న చర్యలను ఉన్నతాధికారులకు నివేదించారా? అనే ప్రశ్నలకు జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం మాత్రమే కాకుండా, తనిఖీల్లో గుర్తించిన అంశాలపై తదుపరి చర్యలు తీసుకోవడం, ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించడం, వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం ద్వారా మాత్రమే అధికార యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని వారు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంలో అసలు ఏం జరిగింది, తనిఖీల్లో ఏ అంశాలు వెలుగులోకి వచ్చాయి, ఏఆర్ఐ, సర్వేయర్‌లపై ఎలాంటి ఫిర్యాదులు ఉన్నాయి, ఉన్నతాధికారులు ఎలాంటి ఆదేశాలు ఇచ్చారు, ఆదేశాల మేరకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారు అనే అంశాలపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. ఆకస్మిక తనిఖీలు జరిగాయి... చర్యలకు ఆదేశాలు ఇచ్చారంటున్నారు... మరి చర్యలు ఎక్కడ? అధికారులపై వచ్చిన వినతులపై విచారణ ఏమైంది? ఆదేశాలు అమలు కాకపోవడానికి కారణమేంటి? తనిఖీలు నామమాత్రమేనా? లేక పూర్తిస్థాయి చర్యలు త్వరలో ఉంటాయా? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, ఉన్నతాధికారుల ఆదేశాలను స్పష్టంగా అమలు చేసి, తీసుకున్న చర్యల వివరాలను వెల్లడించాలని పలువురు కోరుతున్నారు.

**పూర్తి వివరాలతో ప్రత్యేక కథనం అతిత్వరలో...**

# పేదలకు వరంగా ఎయిమ్స్ బీబీనగర్






**తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం..**
**తెలంగాణ ప్రజలకు ఆశాకిరణంగా మారుతున్న ప్రతిష్టాత్మక వైద్య సంస్థ**
**కార్పొరేట్ ఆసుపత్రుల భారీ బిల్లులకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ వైద్య సేవలు**

అనారోగ్యం వచ్చిందంటే చాలు.. మందుల ఖర్చు ఎంత? వైద్య పరీక్షలకు ఎంత అవుతుంది? ఆసుపత్రి బిల్లు ఎలా భరించాలి? శస్త్రచికిత్స అవసరమైతే లక్షల రూపాయలు ఎక్కడి నుంచి తీసుకురావాలి? అనే ఆందోళన పేద, మధ్యతరగతి కుటుంబాలను వెంటాడుతోంది. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు, స్కానింగ్‌లు, మందులు, చికిత్సలు, శస్త్రచికిత్సల పేరుతో భారీ మొత్తాలు ఖర్చు చేయాల్సి వస్తున్న పరిస్థితుల్లో.. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సంస్థలు ఎంతో కీలకంగా మారుతున్నాయి. అలాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ఒకటిగా బీబీనగర్ ఎయిమ్స్ ప్రజలకు వైద్య సేవలు అందిస్తోంది.

### వైద్య ఖర్చుల భారం నుంచి పేదలకు ఊరట

ఒక కుటుంబంలో ప్రధాన వ్యక్తికి అనారోగ్యం వస్తే ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి ఒక్కసారిగా తలకిందులయ్యే పరిస్థితులు ఉన్నాయి. పిల్లల చదువుల కోసం దాచుకున్న డబ్బు, కూతురు పెళ్లి కోసం కూడబెట్టిన సొమ్ము, చిన్న వ్యాపారం కోసం పెట్టుకున్న పెట్టుబడి.. ఇలా కుటుంబ భవిష్యత్తు కోసం దాచుకున్న మొత్తాన్ని కూడా వైద్య ఖర్చుల కోసం వెచ్చించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎయిమ్స్ వంటి వైద్య సంస్థలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయి.

### ఒకే ప్రాంగణంలో పలు వైద్య విభాగాలు

బీబీనగర్‌లోని ఎయిమ్స్‌లో పలు వైద్య విభాగాల ద్వారా రోగులకు సేవలు అందుతున్నాయి. సాధారణ వైద్యం నుంచి వివిధ ప్రత్యేక వైద్య విభాగాల వరకు సేవలు అందుబాటులో ఉండటం వల్ల రోగులకు ప్రయోజనం కలుగుతోంది. సాధారణ వైద్యం, సాధారణ శస్త్రచికిత్స, ఎముకలు-కీళ్ల వైద్యం, కంటి వైద్యం, చెవి-ముక్కు-గొంతు వైద్యం, చర్మవ్యాధుల వైద్యం, దంత వైద్యం, మహిళా మరియు ప్రసూతి వైద్యం, చిన్నపిల్లల వైద్యం తదితర విభాగాల్లో వైద్య సేవలు పొందే అవకాశం ఉంది. రోగి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన అనంతరం అవసరమైన వైద్య పరీక్షలు, తదుపరి చికిత్స, మందులు లేదా శస్త్రచికిత్స గురించి వైద్యులు సూచనలు చేస్తారు.

### కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రత్యామ్నాయమా?

ప్రైవేట్ ఆసుపత్రుల్లో సాధారణ వైద్యుడిని సంప్రదించడానికి కూడా గణనీయమైన ఫీజులు చెల్లించాల్సి వస్తున్న సందర్భాలు ఉన్నాయి. ప్రత్యేక వైద్యులను సంప్రదించడం, వైద్య పరీక్షలు చేయించడం, ఆసుపత్రిలో చేరడం వంటి వాటికి ఖర్చు మరింత పెరుగుతుంది. దీనికి భిన్నంగా ప్రభుత్వ వైద్య సంస్థల్లో అందుబాటులో ఉండే తక్కువ ఖర్చు వైద్య సేవలు సామాన్య ప్రజలకు ఆర్థికంగా కొంత ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. అయితే ప్రతి రోగికి ఒకే విధమైన ఖర్చు ఉండదు. రోగి ఆరోగ్య పరిస్థితి, అవసరమైన పరీక్షలు, మందులు, చికిత్స విధానం, శస్త్రచికిత్స అవసరం తదితర అంశాల ఆధారంగా ఖర్చులు మారవచ్చు.

### 'అన్నీ ఉచితం' అనే ప్రచారాన్ని నమ్మొద్దు

ఎయిమ్స్ గురించి సామాజిక మాధ్యమాల్లో అనేక రకాల ప్రచారాలు జరుగుతున్నాయి. ప్రతి శస్త్రచికిత్స పూర్తిగా ఉచితం, బయట వేల రూపాయలు అయ్యే ప్రతి పరీక్ష ఇక్కడ కొన్ని వందల రూపాయలకే జరుగుతుంది వంటి ప్రచారాలను పూర్తిగా నమ్మకుండా, సంబంధిత విభాగంలో అధికారికంగా వివరాలు తెలుసుకోవడం మంచిది. వైద్య సేవలకు సంబంధించిన ఫీజులు, పరీక్షల ఛార్జీలు, మందుల లభ్యత, శస్త్రచికిత్స ఖర్చులు, ఇతర సేవల వివరాలు కాలానుగుణంగా మారే అవకాశం ఉంది. కాబట్టి రోగులు ఆసుపత్రిలో సంబంధిత కౌంటర్ లేదా అధికారిక సిబ్బందిని సంప్రదించి ప్రస్తుత ఛార్జీలు, విధానాల గురించి తెలుసుకోవాలి.

### ఆధునిక సదుపాయాలతో విశాలమైన ప్రాంగణం

బీబీనగర్ ఎయిమ్స్‌లో విశాలమైన ప్రాంగణం, పరిశుభ్రమైన వాతావరణం, ఆధునిక వైద్య సదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. వివిధ వైద్య విభాగాలు ఒకే వైద్య సంస్థలో ఉండటంతో రోగులకు అవసరమైన సేవలను పొందడంలో కొంత సౌలభ్యం కలుగుతోంది. ప్రత్యేకించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, నిపుణుల వైద్య సలహా అవసరమైన వారు సంబంధిత విభాగాన్ని సంప్రదించి వైద్యుల సూచన మేరకు చికిత్స పొందవచ్చు.

### ఆసుపత్రికి వెళ్లే ముందు ఇవి వెంట తీసుకెళ్లండి

ఎయిమ్స్ బీబీనగర్‌కు మొదటిసారి వెళ్లే రోగులు కొన్ని ముఖ్యమైన పత్రాలు వెంట తీసుకెళ్తే వైద్యులను సంప్రదించడంలో సౌకర్యంగా ఉంటుంది.

- ఆధార్ లేదా ఇతర గుర్తింపు పత్రం
- గతంలో చేయించుకున్న వైద్య పరీక్షల నివేదికలు
- స్కానింగ్ నివేదికలు
- పాత వైద్యుల చీటీలు
- ప్రస్తుతం వాడుతున్న మందుల వివరాలు
- గతంలో జరిగిన శస్త్రచికిత్సలకు సంబంధించిన పత్రాలు

ఇవి అందుబాటులో ఉంటే వైద్యులు రోగి గత వైద్య చరిత్రను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. వైద్య నమోదు సమయాలు ముందుగానే తెలుసుకోండి. మొదటిసారి ఆసుపత్రికి వెళ్లే వారు బయటి రోగుల విభాగం నమోదు సమయాలు, సంబంధిత వైద్య విభాగం అందుబాటులో ఉండే రోజులు, అవసరమైన పత్రాలు తదితర వివరాలను ముందుగానే తెలుసుకుని వెళ్లడం మంచిది. ఆసుపత్రిలో రద్దీ ఉండే అవకాశం ఉన్నందున అవసరమైన సమయం కేటాయించుకుని వెళ్లాలి.

### వైద్య ఖర్చుల భయంతో చికిత్సను వాయిదా వేయొద్దు

అనారోగ్యం వచ్చినప్పుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్సను వాయిదా వేయడం ప్రమాదకరం. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, శస్త్రచికిత్స అవసరమైన సందర్భాల్లో వైద్యుల సలహాను ఆలస్యం చేయకుండా తీసుకోవడం అవసరం. భారీ ప్రైవేట్ ఆసుపత్రి బిల్లులను భరించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలు ముందుగా తమకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సేవల గురించి తెలుసుకోవడం మంచిదని పలువురు సూచిస్తున్నారు. ఎయిమ్స్ బీబీనగర్ వంటి ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రతిష్టాత్మక వైద్య సంస్థలు ప్రజలకు అందుబాటులో ఉండటం ఆరోగ్య రంగంలో ఒక ముఖ్యమైన ముందడుగుగా చెప్పవచ్చు.

### ఎయిమ్స్ బీబీనగర్

చిరునామా:
బీబీనగర్, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ.

సంప్రదింపు నంబర్లు:
08685-293300
08685-295050


### ముఖ్య గమనిక

బయటి రోగుల విభాగం సమయాలు, వైద్య విభాగాలు, పరీక్షల ఛార్జీలు, చికిత్సలకు సంబంధించిన ఖర్చులు మరియు ఇతర సేవల వివరాలు మారే అవకాశం ఉంది. కాబట్టి ఆసుపత్రికి వెళ్లే ముందు అధికారిక సమాచారం ద్వారా ప్రస్తుత వివరాలను నిర్ధారించుకోవడం మంచిది. "ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు. ఆర్థిక పరిస్థితి కారణంగా వైద్యం దూరం కాకూడదు." పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా తగిన సమయంలో వైద్యులను సంప్రదించాలని విజ్ఞప్తి. - జై భీమ్ టీవీ న్యూస్

# బోనాల పండుగలు ఐక్యతకు ప్రతీకలు

**యువత ఆవేశాలకు, ఈగోలకు దూరంగా ఉండాలి : ఎమ్మెల్యే నాయిని**





**హనుమకొండ, 30 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

రాగన్న ద్వారజా పోచమ్మ బోనాల పండుగ సందర్భంగా పాలారం బండి గ్రామంలో నిర్వహించిన బోనాల ఊరేగింపులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోనాల పండుగలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ప్రజలంతా ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో పండుగలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. యువత ఆవేశాలకు, ఈగోలకు, కక్షలకు దూరంగా ఉండాలని సూచించారు. చిన్నపాటి ఆవేశం కూడా వ్యక్తి జీవితంతో పాటు కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తు కోసం కష్టపడాలని పిలుపునిచ్చారు.మన ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలంతా సోదరభావంతో కలిసిమెలిసి జీవించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు విష్ణు రెడ్డి, మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, నాయకులు తోట పవన్, కానుగంటి శేఖర్, బోనాల నిర్వాహకులు అరవింద్ అక్కినపల్లి, సుశీల్ మాడిశెట్టి, అఖిల్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# 35వ రోజుకు చేరిన 'ఇంటింటికీ టీడీపీ'..

## 94 లక్షల ఇళ్లకు చేరిన ప్రచారం

35వ రోజుకు చేరిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం

ఇప్పటివరకు 94.22 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరిస్తున్న నేతలు

ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా సేకరిస్తున్న కార్యకర్తలు

కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని టీడీపీ వెల్లడి


**విజయవాడ, జై భీమ్ న్యూస్**

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ తెలుగుదేశం -- 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఆదివారంతో ఈ కార్యక్రమం 35వ రోజు పూర్తి చేసుకుంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 94.22 లక్షల ఇళ్లను సందర్శించినట్లు టీడీపీ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఆదివారం ఒక్కరోజే టీడీపీ నాయకులు, కార్యకర్తలు 1,78,567 కుటుంబాలను నేరుగా కలిశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం, వారి అభిప్రాయాలను తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. ప్రతి గడపకు వెళ్లి రైతులకు, మహిళలకు, యువతకు, పేద, మధ్యతరగతి వర్గాలకు అందుతున్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వారి నుంచి సూచనలు, అభిప్రాయాలను సేకరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి తమ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, వారి భాగస్వామ్యంతో ఇది మరింత విస్తృతంగా సాగుతోందని టీడీపీ తెలిపింది. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారని ఆ ప్రకటనలో పేర్కొంది.




# గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె వివాహానికి హాజరైన చంద్రబాబు





**అధికారిక పర్యటనల మధ్య రెండు వివాహ వేడుకలకు హాజరైన సీఎం చంద్రబాబు**
**గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె వివాహానికి హాజరు**
**అనంతపురంలో నూతన దంపతులు శివరాజు-విద్యను ఆశీర్వదించిన సీఎం**
**శ్రీకాళహస్తి పర్యటనలోనూ మరో పెళ్లి వేడుకలో పాల్గొన్న ముఖ్యమంత్రి**
**పార్టీ నేతల కుటుంబాల్లోని శుభకార్యాలకు ప్రాధాన్యతనిచ్చిన చంద్రబాబు**

**అనంతపురం, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ పార్టీ నేతల ఇళ్లలోని శుభకార్యాలకు హాజరయ్యారు. ఆదివారం ఒకే రోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివరాల్లోకి వెళ్తే, అనంతపురం జిల్లా గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె విద్య, అనంతపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడి కుమారుడు శివరాజుల వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. అనంతపురం పట్టణంలోని ఎమ్‌వైఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఈ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా హాజరయ్యారు. వేదికపైకి వెళ్లి నూతన దంపతులు శివరాజు-విద్యలను మనసారా ఆశీర్వదించి, వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. ముఖ్యమంత్రి రాకతో వివాహ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం, తన పర్యటనలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గానికి వెళ్లిన చంద్రబాబు, అక్కడ కూడా మరో వివాహ వేడుకలో పాలుపంచుకున్నారు. స్వర్గీయ పీఆర్ మోహన్ - ఇందిర దంపతుల కుమార్తె డింపుల్, రాజేష్‌ల వివాహానికి హాజరై నూతన జంటను ఆశీర్వదించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

## నాన్‌వెజ్ వల్ల ఇన్ని సమస్యలు వస్తాయా?



ప్రతి రోజూ నాన్ వెజ్ తింటే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ నాన్ వెజ్ ఐటెమ్స్ తినే వారిలో ఖచ్చితంగా కొన్ని వ్యాధులు వస్తాయట. ఆహార అలవాట్లు.. శరీర ఆరోగ్యం మీదనే కాకుండా.. మానసిక ఆరోగ్యం మీద కూడా ప్రభావం చూపిస్తుంటాయి. రోజూ ఫాస్ట్ ఫుడ్స్, లేదా మాంసం తినే వారిలో సాధారణంగా డయాబెటీస్, బీపీ, క్యాన్సర్, ఊబకాయం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు మతి మరుపు కూడా వచ్చే అవకాశం ఉందట. ప్రతిరోజూ మాంసం తినే వారిలో వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఎలా అనుకుంటున్నారా? ఆస్ట్రేలియాలోని బాండ్ యూనివర్శిటీలో 438 మంది వ్యక్తులపై పరిశోధన చేశారు ఆరోగ్య నిపుణులు. ఆహారపు అలవాట్లు జ్ఞాపకశక్తిపై ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నారు. ఈ అధ్యయనం 438 మంది కొనసాగితే అందులో 108 మందికి అల్జీమర్స్ వ్యాధి వచ్చినట్టు తేలిందట. దీని ప్రకారం ఎక్కువగా నాన్ వెజ్ తింటే వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వస్తుంది అంటున్నారు నిపుణులు. అంటే ఇంట్లో మనుషులను కూడా గుర్తించలేని పరిస్థితి కూడా వస్తుందట. ప్రతిరోజూ మాంసం తినేవారిలో అధిక బరువు, హై కొలెస్ట్రాల్, డయాబెటీస్, బీపీ, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం మరింత ఎక్కువ ఉంటుందట. ఈ సమస్యలు మాత్రమే కాదు ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు కూడా వస్తాయట. రోజూ పండ్లు, కూరలు, గింజలు తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు అసలు కనిపించడం లేదని పరిశోధనలో తేలిందట. మాంసాహారాలు ఎక్కువగా తీసుకుంటే నరాల సమస్యలు వస్తాయి సో స్కిప్ చేయండి. ఎక్కువగా తినకుండా లిమిట్ గా తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. అతి సర్వత్రా వర్జయేత్. సో మితంగా తిని ఆరోగ్యంగా ఉండండని సలహా ఇస్తున్నారు నిపుణనలు.

## పెరుగు వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉంటాయా?

పేగులకు మంచిది: పెరుగు లోని ప్రోబయోటిక్స్ పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుతుంటాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించే శక్తి కూడా ఈ పెరుగుకు ఉంటుంది. మానసిక ఒత్తిడి: పెరుగులోని యాంటీఆక్సిడెంట్లు, మంచి కొవ్వులు, ప్రోబయోటిక్‌లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తిని పెరుగు తగ్గిస్తుంది. ఈ హార్మోన్ నియంత్రణలో ఉంటే బరువు తగ్గుతుంటారు. జ్ఞాపకశక్తి మెరుగుదల: జ్ఞాపకశక్తిని పెంచుకోవాలనుకుంటే ప్రతిరోజూ పెరుగు తినాలి అంటున్నారు నిపుణులు. పెరుగులోని కాల్షియం, విటమిన్ డి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి సహాయం చేస్తుంది. చర్మ సంరక్షణ: పెరుగు తినేవారి చర్మం పొడిబారకుండా ఉంటుంది. తేమ వల్ల యవ్వనంగా కనిపిస్తారు కూడా. దురద ఉంటే కూడా పెరుగు తినడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు అంటున్నారు నిపుణులు. పెరుగులోని జింక్, విటమిన్ సి, కాల్షియం చర్మానికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఎముకలు, దంతాల బలం : ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది ఈ పెరుగు. వీటికి అవసరమైన ఫాస్ఫరస్, కాల్షియం లు కూడా ఇందులో ఉంటాయి. దీన్ని ప్రతిరోజూ తినడం వల్ల దంతాలు చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ఎముకలను కూడా బలోపేతం చేయడం వల్ల కీళ్లనొప్పులు రాకుండా నిరోధించుకోవచ్చు. బిపి %డ% షుగర్ నియంత్రణ: పెరుగులోని పోషకాలు సులభంగా జీర్ణం అవడానికి కూడా ఈ పెరుగు ఉపయోగపడుతుంది. దీనిలోని ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పెరుగులో ఉండే మెగ్నీషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ పెరుగు తీసుకునే వారికి కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి అంటున్నారు నిపుణులు. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మెదడుకు మంచిది: పెరుగులో ఉండే ప్రోటీన్ మెదడు కణాల పెరుగుదల , నిర్వహణకు సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు. పెరుగు, పంచదార రెండింటినీ కలిపి తింటే మెదడుకు మంచిదట. ఎందుకంటే పెరుగుతో పాటు పంచదార తిన్నప్పుడు లభించే గ్లూకోజ్ మెదడు శక్తిని పెంచడానికి మరింత సహాయపడుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది పెరుగు. ఇందులోని టైరోసిన్ వంటి అమైనో ఆమ్లాలు మెదడులో డోపమైన్, సెరోటోనిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి హార్మోన్‌లను నియంత్రిస్తాయి.




# ఈ నీరు అమృతంతో సమానం!

ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలి వల్ల శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వాటిలో ముఖ్యంతో వయసుతో సంబంధం లేకుండా వచ్చే స్థూలకాయం ఒకటి. ఊబకాయాన్ని తగ్గించుకోవడానికి మంచి ఆహారం, వ్యాయామమే మార్గం. అంతేకాకుండా కొన్ని ఇంటి చిట్కాలను పాటించడం వల్ల బరువు తగ్గొచ్చని మన పెద్దలు చెబుతున్నారు. బరువు తగ్గడానికి, ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగితే.. నిమ్మ, తేనె: ఒక గ్లాసు నీటిలో సగం నిమ్మకాయ, ఒక చెంచా తేనె, చిటికెడు ఎండుమిర్చి వేసి తినాలి. నల్ల మిరియాలలో పైపెరిన్ అనే మూలకం ఉంటుంది. ఇది శరీరంలో కొత్త కొవ్వు కణాలు పేరుకుపోవడానికి అనుమతించదు. నిమ్మకాయలో ఉండే ఆస్కార్బిక్ యాసిడ్ శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. శరీరం నుండి విషపూరిత మూలకాలను తొలగించడంలో సహాయపడుతుంది. సోంపు నీరు: 6-8 సోంపు గింజలను ఒక కప్పు నీటిలో ఐదు నిమిషాలు మరిగించాలి. దీన్ని వడపోసి ఉదయం ఖాళీ కడుపుతో వేడి వేడిగా తాగాలి. ఇది అధిక ఆకలి సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాకుండా తినాలనే కోరికను తగ్గిస్తుంది. ఇది శరీరంలోని మురికిని శుభ్రపరుస్తుంది. మూత్రవిసర్జన, చెమట అధికంగా వచ్చేలా ప్రేరేపిస్తుంది. జీలకర్ర నీరు: జీలకర్ర నీటిని తాగడం వల్ల స్థూలకాయం త్వరగా తగ్గుతుంది. ఇందులో క్యుమినాల్డిహైడ్, థైమోక్వినోన్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. ఆర్థరైటిస్ , కీళ్ల నొప్పులు వంటి పరిస్థితులు ఉంటే, చికాకు, వాపును తగ్గించడంలో జీలకర్ర నీరు ప్రభావవంతంగా ఉంటుంది. మెంతి గింజల నీరు: మెంతి నీరు తాగడం వల్ల స్థూలకాయం తగ్గడమే కాకుండా మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. రక్తంలో గ్లూకోజ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో మెంతులు సహకరిస్తాయి. మెంతి నీటిని తయారు చేయడానికి, ముందుగా 1 టీస్పూన్ మెంతి గింజలను 1 గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టండి. దీని తరువాత, ఉదయం నిద్రలేచిన తర్వాత, ఈ నీటిని వడపోసి ఖాళీ కడుపుతో తాగాలి.



## గుండెపోటుకు గురికాకూడదనుకునే వారు వీటిని అలవాటు చేసుకోవాల్సిందే

ప్రస్తుత రోజుల్లో గుండెపోటు అనేది సర్వసాధారణమైపోయింది. ఇంతకుముందు ఈ సమస్య పెద్దవారిలో మాత్రమే కనిపించేది. కానీ, ఇప్పుడు యువత కూడా దీని బారిన పడుతున్నారు. ఎవరైనా డ్యాన్స్ చేస్తున్నప్పుడు, లేదా ఏదైనా పనిచేస్తున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా పడిపోయారని మీరు తరచుగా వినే ఉంటారు. అలాంటి వారు కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణిస్తారు. వీటన్నింటికీ ప్రధాన కారణం ధమనులలో ఫలకం అడ్డుపడటం. దీని కారణంగా రక్తం గుండెకు చేరదు. శరీరంలో ఆక్సిజన్ కొరత ఉంటుంది. ఈ పరిస్థితిలో గుండెపోటు లేదా గుండె ఆగిపోయే ప్రమాదం పెరుగుతుంది. ఈ పరిస్థితులన్నింటినీ నివారించడానికి, మీ జీవనశైలిలో కొన్ని మార్పులు అవసరం. అందుకోసం ఈ అలవాట్లను అలవాటు చేసుకోండి. కొలెస్ట్రాల్ లేదా ఫలకం ధమనులను అడ్డుకోవడం వల్ల గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ సంభవిస్తుంది. కొలెస్ట్రాల్ పెరగడానికి అతి పెద్ద కారణం అనారోగ్యకరమైన ఆహారం. ఈ పరిస్థితిలో, మీరు గుండె సంబంధిత సమస్యలను నివారించాలనుకుంటే ఈ రోజు నుండి అనారోగ్యకరమైన ఆహారం లేదా ప్రాసెస్ చేసిన, ప్యాక్ చేసిన ఆహారాన్ని తినడం మానేయండి. వాటికి బదులుగా పచ్చి ఆకు కూరలు, పప్పులు, తృణధాన్యాలు, తాజా పండ్లు, గుడ్లు వంటి తాజా ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని తినండి. ధమనులలో ఫలకం పేరుకుపోకుండా నిరోధించడానికి, మీరు రోజూ వ్యాయామం చేయడం ముఖ్యం. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయాలి. దీని కోసం ప్రతిరోజూ సైకిల్, ఈత, పరుగు, నడక, శక్తి శిక్షణ చేయండి. ధూమపానం ఊపిరితిత్తులకు మాత్రమే హాని చేస్తుందని అనుకుంటే అది తప్పు. అది గుండెకు కూడా హాని చేస్తుంది. సిగరెట్ పొగ నుండి విడుదలయ్యే రసాయనాలు ధమనులలో పొరను ఏర్పరుస్తాయి. దీని వలన ధమనులు నిరోధించబడతాయి. ఈ రోజుల్లో, ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారుతోంది. ఇది ధమనులలో వాపును కలిగిస్తుంది. దీని వలన ధమనులు ఉబ్బడం అలాగే నిరోధించబడతాయి. ఒత్తిడి కారణంగా శరీరంలో 1500 రసాయనాలు విడుదలవుతాయని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఈ పరిస్థితిలో, ఒత్తిడిని నియంత్రించడానికి ప్రశాంతంగా ఉండండి. కోపం తెచ్చుకోకండి. ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయండి. మీరు మీ హృదయాన్ని ప్రేమిస్తే మద్యానికి దూరంగా ఉండండి. ఆల్కహాల్ కొలెస్ట్రాల్, రక్తపోటు రెండింటినీ పెంచుతుంది. కాబట్టి, గుండె ఆరోగ్యంగా ఉండటానికి దాని వినియోగాన్ని నివారించండి. మీ బరువును అదుపులో ఉంచుకోండి. అధిక బరువు కొలెస్ట్రాల్, అధిక రక్తం, అధిక షుగర్‌కి అతి పెద్ద కారణంగా పరిగణించబడుతుంది. కాబట్టి దానిని అదుపులో ఉంచండి. దీని కోసం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. అలాగే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి.



## అలాంటివారు ఈ పండు తినకండి!

జామ పండు.. పేదల ఆపిల్ గా పేరు దక్కించుకున్న జామ పండు అన్ని సీజన్లో విరివిగా లభిస్తుంది. దానిమ్మ పండ్లతో పోల్చుకుంటే ఖర్చు కూడా చాలా తక్కువ. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా జామ పండును ఎంతో ఇష్టంగా తింటారు. జామపండు పోషకాలకు నిలయం అని చెప్పవచ్చు. ఇకపోతే జామ పండు తినడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి.. అయితే కొంతమందికి జామపండు పడదు. కొంతమందికి సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయి. ఇంకొంతమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జామ పండు తినకూడదో ఇప్పుడు చూద్దాం. జామ పండు చలికాలంలో తింటే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. జామ పండు తినడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. జామ పండులో ఉండే విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని పెంచుతుంది. అలాగే శరీరానికి కావలసిన విటమిన్ డి కూడా లభిస్తుంది. ఇన్ని పోషకాలు ఉన్న జామ పండు కి కొంత మంది దూరంగా ఉండాలి. అలర్జీ సమస్యలతో బాధపడేవారు జామపండు తినకపోవడం మంచిది. అలాగే చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధ పడే వారు కూడా జామపండు తినకూడదు. జామ పండు తింటే చర్మం పై దద్దుర్లు, మంట, వాపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఉన్నవారు జామపండుకు దూరంగా ఉండటమే మేలు అని నిపుణులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండాలి. జామ పండు జీర్ణం అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండటమే మంచిది.



## పడుకునే ముందు వాము నీటిని తాగితే ఇన్ని లాభాలా?



వామును మెత్తటి పౌడర్‌గా చేసుకుని నిల్వ చేసుకోవాలి. పంటి నొప్పితో ఇబ్బంది పడుతున్నవారు.. అర టీ స్పూన్ వాము పౌడర్, కొద్దిగా ఆలివ్ ఆయిల్, గోరువెచ్చని నీటితో కలిపి తాగితే, పంటి నొప్పిని తగ్గిస్తుంది. అంతేకాదు..నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది. గోరువెచ్చని నీటిలో వాము పౌడర్ కలిపి తాగడం వల్ల నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే తిమ్మిర్లు, కడుపు నొప్పిని దూరం చేస్తుంది. పొత్తి కడుపు తగ్గుతుంది. ఇలా క్రమంగా వాము వాటర్ తాగుతూ ఉంటే.. బరువు కూడా తగ్గుతారు. ఇందుకోసం వాము పొడి లేదంటే, వాముని నేరుగా కూడా తీసుకోవచ్చు. వాములో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల శ్వాస కోస వ్యాధులు రాకుండా ఉంటాయి. ఒక వేళ జలుబు, దగ్గు, కఫం లాంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ నీటిని తాగడం వల్ల అవి తగ్గుముఖం పడతాయి. రాత్రి పడుకునే ముందు ఇలా గోరువెచ్చని నీటిలో వాము పౌడర్‌ని కలిపి తాగడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. సాధారణంగా కడుపు ఉబ్బరం, త్రేన్పులు, జీర్ణ సమస్యల్ని దూరం చేయడంలో ఈ వాము వాటర్ బాగా హెల్ప్ చేస్తాయి. వాముని కప్పున్నర నీటిలో వేసి మరిగించి కప్పు అయ్యే వరకూ ఉంచాలి. దీనిని ఫిల్టర్ చేసి రెగ్యులర్‌గా తీసుకుంటే బరువు తగ్గుతారు. పిల్లలకు అరుగుదల సరిగ్గా లేకపోయినా, పెద్దలు గ్యాస్ లాంటి వాటితో బాధ పడుతున్నా వాము ఔషధంగా పనిచేస్తుంది. వాముతో జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM